1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

సంపుటి : 2 సంచిక : 259 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 24 జూలై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 259 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 24 July 2025 PAGES : 8 PRICE : 3/-



# స్వర్ణాంధ్ర కావాలంటే ప్రజల ఆలోచనా విధానం మారాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 23)

స్వర్ణాంధ్ర కావాలంటే ప్రజల ఆలోచనా విధానం మారాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో సీఎం పాల్గొన్నారు. "పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. అంటు వ్యాధులు రావడానికి ప్రధాన కారణం చెత్త, అపరిశుభ్రత. గత వైకాపా ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది గానీ.. చెత్త మాత్రం తీయలేదు. ప్రజారోగ్యాన్ని వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. అక్టోబరు 2 నాటికి అన్ని మున్సిపాలిటీల్లో చెత్తాచెదారం తొలగిస్తాం. గత ప్రభుత్వంలో అరాచకాన్ని సృష్టించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కార్యక్రమాలు చేస్తున్నాం. ప్రతి ఒక్కరి ఆదాయం పెరిగి.. ఆరోగ్యంగా ఉండాలనేదే నా ఏకైక కోరిక. మన ఆలోచనలు ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలి. ఈ ప్రపంచంలో ఏదీ వృథా కాదు.. చెత్త నుంచి సంపద సృష్టించొచ్చు. ఈ-వేస్ట్‌ను రీసైక్లింగ్‌కు పంపేలా ఆలోచనలు చేస్తున్నాం. పేదవాడి ఆరోగ్యం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్.. సూపర్ హిట్

"సంపద సృష్టించడం.. ఆదాయాన్ని పెంచడం మాకు తెలుసు. అప్పులతో సంక్షేమ కార్యక్రమాలు చేస్తే దీర్ఘకాలం కొనసాగదు. నేను సూపర్ సిక్స్ అంటే సాధ్యం కాదన్నారు.. చేసి చూపించాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యింది. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఎప్పటికప్పుడు వారి ఖాతాల్లో నగదు జమచేస్తున్నాం. రాష్ట్రంలో 40వేల హెయిర్ కటింగ్ సెలూన్లకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు చాలా ఆనందంగా ఉన్నారు. ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్ని వర్గాలకు మేలు చేసేందుకు కృషి చేస్తున్నాం. పీ-4 ద్వారా పేదప్రజలను ఆదుకుంటున్నాం. పేదలపై పన్నుల భారం తగ్గించాలని కేంద్రం యోచిస్తోంది" అని సీఎం తెలిపారు.

అమరావతి మునిగిపోయిందని వైకాపా దుష్ప్రచారం చేస్తోంది

"వైకుంఠపాళి ఆటలు మన రాష్ట్రానికి వద్దు. మనకు అభివృద్ధి కావాలి.. పేదరికం పోవాలి. పేదవాళ్లకు సాయం చేసేందుకు మార్గదర్శులు ముందుకు రావాలి. పెద్దాపురం నియోజకవర్గ సమస్యలన్నీ పరిష్కరిస్తాం. ఎన్నికల ముందు పింఛన్ల పేరుతో ఎండల్లో తిప్పి వృద్ధుల మరణానికి కారణమయ్యారు. వాలంటీర్ల వ్యవస్థ లేకున్నా ఇంటికెళ్లి మరీ పింఛను ఇస్తున్నాం. మీ రాష్ట్రంలో భూతం ఉంది.. -మిగతా 4లో

## టారిఫ్‌ల అనిశ్చితి వేళ.. అమెరికాకు పోస్టల్ సర్వీసులు నిలిపివేత



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 23)

అమెరికాకు అన్నిరకాల పోస్టల్ సేవలను భారత్ నిలిపివేసింది . అయితే ఇది తాత్కాలికమేనని పోస్టల్ విభాగం వెల్లడించింది. ఈ నెలాఖరులో అమల్లోకి వచ్చే కస్టమ్ నిబంధనల కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఆగస్టు 25 నుంచి ఈ సేవలు నిలిచిపోనున్నాయి. జులై 30న అమెరికా యంత్రాంగం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం.. 800 డాలర్ల విలువైన వస్తువులపై ఉన్న పన్ను మినహాయింపులను ఉపసంహరించుకుంది. ఫలితంగా అమెరికాకు వెళ్లే అన్ని పోస్టల్ సర్వీసులకు వాటి విలువతో సంబంధం లేకుండా సుంకాలకు లోబడి -మిగతా 4లో

## అన్ని స్థాయిలలో అవినీతి పెరిగిపోవడమే ఈ దుస్థితికి కారణం: జగన్

**టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు**

**14 నెలల్లోనే రూ.1.86 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ**

**తమ ఐదేళ్ల పాలనలో చేసిన అప్పులో ఇది 56 శాతమని వెల్లడి**

**రాష్ట్ర సొంత రాబడుల వృద్ధి కేవలం 3.08 శాతానికే పరిమితమైందని వ్యాఖ్య**

**జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు కూడా గత ఏడాదితో పోలిస్తే తగ్గాయని వెల్లడి**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 23)

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఆదాయం తగ్గిపోయి అప్పులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆయన ఆరోపించారు. అన్ని స్థాయిలలో అవినీతి పెరిగిపోవడమే ఈ దుస్థితికి కారణమని ఆయన ఆరోపించారు. కాగ్ లెక్కల ఆధారంగా రాష్ట్ర ఆర్థిక దుస్థితిని వివరిస్తూ, టీడీపీ కూటమి ప్రభుత్వం కేవలం 14 నెలల కాలంలోనే రూ.1,86,361 కోట్ల అప్పు చేసిందని -మిగతా 4లో

## ధర్మస్థల కేసులో.. తప్పుదోవ పట్టించేవారిపై కఠిన చర్యలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 23)

కర్ణాటకలోని పుణ్యక్షేత్రమైన ధర్మస్థలలో వందల మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని ప్రకటించుకున్న పారిశుద్ధ్య కార్మికుడు భీమాను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై రాష్ట్ర ఉపముఖ్య మంత్రి డీ కే శివకుమార్ స్పందించారు. రెండు దశాబ్దాలుగా ' హత్యలు, అత్యాచారాలు, ఖననాలు' జరిగినట్లు తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ సీఎం శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ .. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా ఈ కేసులో తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తిని -మిగతా 4లో

## ఇండియా కూటమి అభ్యర్థికి చంద్రబాబు మద్దతిస్తారా?: బొత్స

**విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలన్న బొత్స**

**ఈ నెల 30న పవన్ కల్యాణ్ ఉక్కు పరిశ్రమపై మాట్లాడాలని డిమాండ్**

**రాష్ట్రంలో అవినీతి, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆరోపణ**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 23)

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై అధికార కూటమి ప్రభుత్వం తన వైఖరిని తక్షణమే వెల్లడించాలని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. విశాఖలో ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి నేతలు విస్మరించారని తీవ్రంగా విమర్శించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని శాసనమండలిలో పవన్ కల్యాణ్, లోకేశ్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు 32 విభాగాలను ప్రైవేటు వ్యక్తులకు ఎందుకు అప్పగిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.



విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించిన నేతలు ఇప్పుడు మౌనంగా ఉండటం సరికాదన్నారు. ఈ నెల 30న విశాఖలో జరగనున్న జనసేన సమావేశంలో పవన్ కల్యాణ్ ఈ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని బొత్స డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడకుండా, గిన్నిస్ బుక్ రికార్డులపై దృష్టి పెట్టారని ఎద్దేవా చేశారు. స్టీల్ ప్లాంట్ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లే బాధ్యత చంద్రబాబు, -మిగతా 4లో

## మరో 50 రోజుల్లో.. సుంకాలపై ట్రంప్ కీలక ప్రకటన

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 23)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ బెదిరింపులకు పాల్పడుతూనే ఉన్నారు. ఫర్నిచర్ దిగుమతులపై సుంకాలు విధిస్తామని తాజాగా హెచ్చరించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు."అమెరికా లోకి వచ్చే ఫర్నిచర్‌పై మేం భారీస్థాయిలో టారిఫ్ ఇన్వెస్టిగేషన్ నిర్వహిస్తున్నాం. 50 రోజుల్లో ఆ విచారణ పూర్తవుతుంది" అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. అయితే ఎంతమేరకు సుంకం విధిస్తారనే దానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు.



నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, మిషిగన్‌కు తిరిగి ఫర్నిచర్ పరిశ్రమను తిరిగి తీసుకురావడానికే ఈ చర్యలని పేర్కొన్నారు. యూఎస్‌లో ఫర్నిచర్, సంబంధిత పరిశ్రమలో జులై నాటికి 3,40,000 మంది ఉపాధి పొందుతున్నారు. 2000 సంవత్సరంతో పోల్చుకుంటే సగం మందే ఇప్పుడు ఆ రంగంలో పనిచేస్తున్నారు. ఇక, అగ్రరాజ్యానికి ఫర్నిచర్‌ను ఎగుమతి చేసే దేశాల్లో చైనా, వియత్నాం ముందువరుసలో ఉన్నాయి. 2024లో 25.5 బిలియన్ డాలర్ల విలువైన సామగ్రిని అమెరికా దిగుమతి చేసుకుందని గణాంకాలు వెల్లడించాయి.

## రౌడీషీటర్ శ్రీకాంత్ వ్యవహారం.. భవిష్యత్తులో ఎవరికీ పెరోల్ సిఫారసు చేయను: కోటంరెడ్డి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 23)

రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ విషయంలో వైకాపా దుష్ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



శ్రీకాంత్‌కు పెరోల్ ఇవ్వాలని ఆయన తండ్రి, సోదరుడు వస్తే -మిగతా 4లో

## ఇది సహజంగా ఏర్పడిన కొరత కాదు... కూటమి నేతలు సృష్టిస్తున్న కృత్రిమ సంక్షోభం: షర్మిల

**రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందంటూ షర్మిల ఆరోపణలు**

**బ్లాక్ మార్కెట్‌లో యూరియా బస్తా రూ. 500కు విక్రయిస్తున్నారని వెల్లడి**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 23)

రాష్ట్రానికి వచ్చిన యూరియా ఏమైందని ప్రభుత్వానికి ప్రశ్న

రైతులకు వెంటనే యూరియా సరఫరా చేయాలని విజ్ఞప్తి

రాష్ట్రంలో రైతులు తీవ్ర యూరియా కొరత ఎదుర్కొంటున్నారంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇది సహజంగా ఏర్పడిన కొరత కాదని, అధికార పార్టీ నేతలు సృష్టిస్తున్న కృత్రిమ సంక్షోభమని ఆమె ఆరోపించారు. ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కోసం రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రూ. 266కు అమ్మాల్సిన యూరియా బస్తాను బహిరంగ మార్కెట్‌లో రూ. 500కు అమ్ముతున్నారని, దీని వెనుక పెద్ద దందా నడుస్తోందని ఆరోపించారు. రాష్ట్రానికి ఇప్పటికే 6.34 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కోటా చేరినట్లు ప్రభుత్వం చెబుతోందని, మరి ఆ నిల్వలు ఏమయ్యాయని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రైతులకు అందాల్సిన యూరియాను అక్రమంగా గోదాములకు తరలించి, బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారని ఆమె దుయ్యబట్టారు. రైతులు తెల్లవారుజాము నుంచే కిలోమీటర్ల మేర క్యూలలో నిలబడినా ఎరువులు దొరకడం లేదని, రైతు సేవా కేంద్రాల వద్ద 'నో స్టాక్' బోర్డులు -మిగతా 4లో

## నచ్చకపోతే మా ఉత్పత్తులు కొనకండి ట్రంప్ ఆంక్షలపై జైశంకర్ కౌంటర్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 23)

రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కేంద్ర విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే తమ ప్రభుత్వం నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు. భారత్‌తో ఏదైనా సమస్యఉంటే.. ఇక్కడి ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రముఖ దినపత్రిక ఎకనామిక్ టైమ్స్ ఆధ్వర్యంలో శనివారం దిల్లీలో జరిగిన 'వరల్డ్ లీడర్స్ ఫోరం' సదస్సులో జైశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోలు చేయడం వల్ల భారత్‌పై వస్తోన్న విమర్శల అంశాన్ని ప్రస్తావించారు. "భారత్-అమెరికా వాణిజ్య చర్చలుఇంకా కొనసాగుతున్నాయి. అయితే, మాకంటూ కొన్ని ప్రయోజనాలున్నాయి. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. మా రైతులు, చిన్న ఉత్పత్తిదారుల -మిగతా 4లో



## ముంపు ప్రాంతాల్లో నిమ్మల పర్యటన.. నీళ్లలో నడుస్తూ సమస్యలపై ఆరా

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 23)

ముంపు ప్రాంతాల్లో సమస్యల శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని వరద ప్రభావిత లంక గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. కనకాయలంకలో నీటిలో నడుస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. "వరద సమయంలో కనకాయలంక కాజ్‌వే ముంపుతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.23 కోట్లతో వంతెన మంజూరు చేస్తాం. త్వరలో టెండర్లు పిలిచి ఏజెన్సీకి అప్పగిస్తాం. ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేస్తూ వరద నష్ట నివారణకు కృషి చేస్తున్నాం. సీఎం నేతృత్వంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం" అని మంత్రి అన్నారు.



షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# భవిష్యత్ నాయకుడు - కందుల విఘ్నేష్ రెడ్డి

## 25వ జన్మదిన వేడుకలతో

# మార్కాపురంలో పండుగ వాతావరణం




(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, ఆగస్టు 23)

రాజకీయాల్లో కొన్ని తరాల కృషి, అనుభవం, పోరాటం ద్వారా ఎదుగుతాయి. కానీ కొన్ని తరాలు తమ ప్రత్యేకత, కృషి, త్యాగంతోనే ప్రజల మనసుల్లో స్థానం సంపాదిస్తాయి. ఈ రెండో వర్గంలో నిలుస్తున్న పేరు..... కందుల విఘ్నేష్ రెడ్డి. మార్కాపురం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, వసంతలక్ష్మి దంపతుల కుమారుడు విఘ్నేష్ రెడ్డి. అమెరికాలోని న్యూయార్క్‌లో ఎంబిఏ చదువుకుంటూ ఉన్నప్పటికీ, తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న మార్కాపురం నియోజకవర్గం పట్ల చూపుతున్న శ్రద్ధ, ప్రజల పట్ల ఉన్న మమకారం ఆయనను భవిష్యత్తు నాయకుడిగా నిలబెడుతున్నాయి.

**తండ్రి బాటలో ముందుకు వచ్చిన వారసుడు**

గత ఎన్నికల సమయంలో



కందుల నారాయణరెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో ఉండగా, ఆ కష్ట సమయంలో విఘ్నేష్ రెడ్డి తన వయసు మరిచి ముందుకు వచ్చారు. ప్రచారం బాధ్యతలన్నీ తన భుజస్కందాల పై వేసుకొని, నియోజకవర్గంలోని సీనియర్ నాయకులను, యువతను సమన్వయం చేస్తూ తండ్రిని విజయవంతంగా ఎమ్మెల్యేగా గెలిపించారు. అప్పుడు ఆయన చూపిన పట్టుదల, క్రమశిక్షణ ప్రజలలో విశేష ఆదరణను సంపాదించిపెట్టింది.

**పార్టీకి బలం ...ప్రజలకు అండ**

యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేయడం, చంద్రబాబు నాయుడు పర్యటనకు సమన్వయం చేయడం, ఇవన్నీ విఘ్నేష్ రెడ్డి సామర్థ్యానికి నిదర్శనాలు. అమెరికాలో చదువుకుంటున్నప్పటికీ, నియోజకవర్గ సమస్యల పై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కారాలు చూపడం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. కార్యకర్తలు, ప్రజల్లో "విఘ్నేష్ రెడ్డి ఉన్నారు కాబట్టి సమస్య తప్పక పరిష్కారం అవుతుంది" అనే నమ్మకం ఏర్పడింది.

**యువతకు ప్రేరణ... సీనియర్లకు అండ**

విఘ్నేష్ రెడ్డి అంటే కేవలం యువత మాత్రమే కాదు, సీనియర్లు కూడా వల్లమాలిన ప్రేమ



చూపుతున్నారు. అందరినీ అక్కున చేర్చుకునే స్వభావం, సమస్యలు విని పరిష్కరించే తీరు ఆయనకు ప్రత్యేక గౌరవాన్ని తీసుకువచ్చింది. యువతలో ఆయన పై ఉత్సాహం, ఆశల జ్వాల వెలుగుతున్నప్పుడు, సీనియర్లు ఆయనను విశ్వసనీయ వారసుడిగా భావిస్తున్నారు.

**పండుగలా మారిన 25వ జన్మదిన వేడుకలు**

ఈ నేపథ్యంలో ఆయన 25వ జన్మదిన వేడుకలు మార్కాపురం నియోజకవర్గంలో పండుగలా మారాయి. ప్రతి మండల కేంద్రంలోనూ ఘనంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పసుపు పతాకాలతో అలంకరించిన వేదికలపై కేక్ కట్టింగ్, పాలు పంచడం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యకర్తలు, అభిమానులు ఒకే స్వరంతో "జయహో విఘ్నేష్ రెడ్డి" అంటూ నినదిస్తున్నారు.

**రాజకీయ వారసత్వానికి నాంది**

విఘ్నేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు కేవలం ఆచారం మాత్రమే కాదు, ఆయన భవిష్యత్తు రాజకీయ ప్రయాణానికి నాంది పలుకుతున్నాయి. మార్కాపురం రాజకీయాల్లో ఆయన ప్రభావం రోజు రోజుకూ పెరుగుతుండగా, టిడిపి బలోపేతానికి ఆయన కృషి విశేషంగా నిలుస్తోంది. "భవిష్యత్తు నాయకుడు విఘ్నేష్ రెడ్డి" అని కార్యకర్తలు నినదిస్తుండడం యాదృచ్ఛికం కాదు... ఆయన చూపుతున్న ప్రతిభకు, కృషికి ప్రతిఫలం.

**భవిష్యత్తు నేతగా నిలిచే వ్యక్తిత్వం**

ప్రజల అండ, కార్యకర్తల విశ్వాసం, తండ్రి వారసత్వం అన్నీ కలిసి విఘ్నేష్ రెడ్డి ని భవిష్యత్తులో ప్రజల మనసులో నిలిచే నాయకుడిగా తీర్చిదిద్దుతున్నాయి. కేవలం 25 ఏళ్ల వయసులోనే ప్రజల్లో ఇంతటి ఆదరణ, పార్టీ కార్యకర్తల్లో ఇంతటి విశ్వాసం సంపాదించడం అరుదైన విషయం. ఈ వేడుకలు ఆయన రాజకీయ భవిష్యత్తుకు ఒక వెలుగు దారి చూపిస్తున్నాయి. విఘ్నేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు కేవలం ఆనందోత్సవం కాదు, ఒక రాజకీయ శక్తి పుట్టుకకు ప్రతీక. మార్కాపురం నుంచి ఆరంభమైన ఈ ప్రయాణం, త్వరలోనే రాజకీయాల్లో కొత్త శక్తిగా మారడం ఖాయమని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# ప్రకాశం పంతులు త్యాగాలు స్ఫూర్తిగా తీసుకోవాలి

**రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలి**
**రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి**
**డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)

ఆంధ్ర కేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని మనందరం రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని పురస్కరించుకుని శనివారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, (తరువాయి 4లో...)

## పొదిలి పట్టణంలో.... విగ్నేష్ రెడ్డి - కాలేషా స్నేహ బంధానికి నిదర్శనం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 23)

మార్కాపురం టిడిపి యువనేత కందుల విఘ్నేష్ రెడ్డికి తన విశ్వసనీయ సహచరులలో ఒకరైన పొదిలి పట్టణానికి చెందిన షేక్ కాలేషా మరోసారి యువనేతపై స్వామి భక్తిని చాటుకున్నారు. ఈ నమ్మకం, ఆప్యాయతే వీరిద్దరి మధ్య బలమైన స్నేహబంధానికి కారణమైంది. పొదిలిలో తనను విశ్వసించి అన్ని కార్యక్రమాలు చూసే స్థాయికి ఎదిగిన కాలేషా, విఘ్నేష్ రెడ్డి కి అన్నీ తానై వ్యవహరిస్తూ ఆయన విశ్వాసాన్ని మరింత పెంచుకున్నారు. పట్టణంలోని టిడిపి కార్యకర్తల మధ్య కూడా కాలేషా తన కృషి, సేవా భావంతో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఈ అనుబంధమే ఇప్పుడు ప్రాంతీయ రాజకీయాల్లో ప్రత్యేక చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో (తరువాయి 4లో...)




# స్వర్ణాంధ్ర కావాలంటే ప్రజల ఆలోచనా విధానం మారాలి

మళ్లీ రాదని గ్యారంటీ ఏంటని అడుగుతున్నారు. వదల బొమ్మాళీ అంటున్న వైకాపా భూతాన్ని పూర్తిగా భూస్థాపితం చేస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుంది. రాష్ట్రం బాగు కోసం కూడా పది తరాల ముందు ఆలోచించాలి. అసెంబ్లీలో ప్రతిపక్ష స్థానం దక్కలేదు.. అందుకే బయట విషం చిమ్ముతున్నారు. కారు కింద సొంత కార్యకర్త పడినా పట్టించుకోరు. నెల్లూరు వెళ్లి మార్ఫింగ్ ఫొటోలతో ప్రచారం చేశారు. అమరావతి మునిగిపోయిందని వైకాపా దుష్ప్రచారం చేస్తోంది. అమరావతికి నిధులు ఇవ్వొద్దని అందరికీ లేఖలు రాశారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా అమరావతిని తయారు చేస్తాం. అమరావతి, విశాఖ, తిరుపతిని మహానగరాలుగా మారుస్తాం. పెట్టుబడులు పెట్టేందుకు వస్తే ఎవరైనా ఆహ్వానిస్తారు. వైకాపా నేతలు మాత్రం పెట్టుబడిదారులను బెదిరిస్తారు. వైకాపా హయాంలో నకిలీ వ్యక్తులకు దివ్యాంగుల పింఛన్లు ఇచ్చారు. పింఛన్లు అర్హులకే అందాలి.. అనర్హులకు కాదు. రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతీసేలా విషప్రచారం చేస్తున్నారు. మనది విజన్ రాజకీయం.. వాళ్లది క్రిమినల్ రాజకీయం" అని చంద్రబాబు అన్నారు.

# టారిఫ్‌ల అనిశ్చితి వేళ.. అమెరికాకు పోస్టల్ సర్వీసులు నిలిపివేత

ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే తాజా ప్రకటన వచ్చింది. 100 డాలర్ల విలువైన గిఫ్ట్ ఐటెమ్స్, లేఖలు, దస్త్రాలకు మాత్రం సుంకాల నుంచి మినహాయింపు కొనసాగుతోంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల మోత మోగిస్తున్నారు. మిత్రదేశం భారత్‌ను వదల్లేదు. రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు అదనపు సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఆగస్టు 27 నుంచి 50శాతం సుంకాలు అమల్లోకి రానున్న నేపథ్యంలో.. వీటి గడువును ట్రంప్ పొడిగిస్తారని తాను ఆశించడం లేదని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నరావో ఇప్పటికే పేర్కొన్నారు. గతంలో ట్రంప్ ప్రకటించినట్లుగా వచ్చే వారం కొత్త టారిఫ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు.అయితే ఈ సుంకాల వసూళ్లకు సంబంధించి యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ వద్ద కచ్చితమైన మార్గదర్శకాలు లేవు. ఈ అనిశ్చితి నేపథ్యంలో ఆగస్టు 25 తర్వాత అమెరికాకు వచ్చే పోస్టల్ కన్‌సైన్‌మెంట్లను స్వీకరించలేమని విమానయాన సంస్థలు పేర్కొన్నాయి. దీంతో యూఎస్‌కు పంపే పోస్టల్ పార్శిళ్ల బుకింగ్‌లను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్ తాత్కాలికంగా నిలిపివేసింది . ఇప్పటికే బుకింగ్ పూర్తిచేసినవారికి రీఫండ్ సౌలభ్యం ఉంది. అలాగే సేవల పునరుద్ధరణకు కృషి చేస్తున్నామని వెల్లడించింది.

# అన్ని స్థాయిలలో అవినీతి పెరిగిపోవడమే ఈ దుస్థితికి కారణం: జగన్

జగన్ పేర్కొన్నారు.తమ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన మొత్తం అప్పులో ఇది 56 శాతానికి సమానమని ఆయన పోల్చి చెప్పారు. ఎన్నికల ముందు రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతామని, అప్పులను తగ్గిస్తామని హామీ ఇచ్చిన టీడీపీ కూటమి, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారం చేపట్టిన అనతికాలంలోనే ఇంత భారీగా అప్పులు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.

రాష్ట్ర ఆదాయ వృద్ధి రేటుపై కూడా జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత రాబడుల (పన్ను, పన్నేతర) వృద్ధి కేవలం 3.08 శాతంగానే నమోదైందని తెలిపారు. దేశ జీడీపీ వృద్ధి 9.8 శాతంగా, కేంద్ర ప్రభుత్వ ఆదాయాల వృద్ధి 12.04 శాతంగా ఉన్నప్పుడు, రాష్ట్ర ఆదాయ వృద్ధి ఇంత తక్కువగా ఉండటం ఆర్థిక మందగమనానికి సూచిక అని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 12.02 శాతం వృద్ధి చెందుతోందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఈ లెక్కలు చెబుతున్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి నాలుగు నెలల్లో కూడా పరిస్థితి ఏమాత్రం మెరుగుపడలేదని జగన్ విమర్శించారు. వినియోగానికి సూచికలైన జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు కూడా గత ఏడాదితో పోలిస్తే తగ్గాయని ఆయన వివరించారు. రాబడులు పడిపోవడం, అప్పులు ఖగోళ వేగంతో పెరగడం

## మొదటి పేజీ తరువాయి

చూస్తుంటే, ప్రభుత్వం తన పాలనా విధానాలపై తీవ్రంగా పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందని జగన్ హితవు పలికారు.

# ధర్మస్థల కేసులో.. తప్పుదోవ పట్టించేవారిపై కఠిన చర్యలు

అరెస్టు చేసిన విషయంపై ప్రశ్నించగా .. తను మాట్లాడిన తర్వాతే భాజపా నేతలు ఈ విషయంపై మాట్లాడుతున్నారని అన్నారు. ధర్మస్థల దేవాలయం, సంస్థలకు నాయకత్వం వహిస్తున్న కుటుంబం సీఎం సిద్ధరామయ్యను కలిసి దర్యాప్తును స్వాగతించినట్లు తెలిపిన విషయాన్ని చెప్పారు. ఈ కేసులో తప్పుదోవ పట్టించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సీఎం, హోంమంత్రి తెలిపిన విషయాన్ని తెలిపారు. తమ ప్రభుత్వం న్యాయం పక్షాన నిలబడుతుందని వ్యాఖ్యానించారు. మతరాజకీయాలు చేయాలనుకోవడం లేదని శివకుమార్ అన్నారు. ధర్మస్థల ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర జరిగిందని, దర్యాప్తులో నిజానిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.

అసలు ఏం జరిగిందంటే?

కర్ణాటకలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థలలో వందల మృతదేహాల ఖననం ఆరోపణల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ మృతదేహాలను తానే పూడ్చిపెట్టానని ప్రకటించుకున్న ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు, ముసుగు వ్యక్తి భీమాను తాజాగా సిట్ అధికారులు అరెస్టు చేశారు. అతడు అబద్ధాలు చెప్పి, ప్రజలను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఇప్పటికే అతడు మాట మార్చిన సంగతి తెలిసిందే.

ధర్మస్థల పరిసరాల్లో 100కు పైగా శవాలు పూడ్చిపెట్టానని చెప్పిన భీమా చివరకు వాటి ఆనవాళ్లు చూపకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు సమాచారంతో ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదారి పట్టించాడన్న అభియోగాలపై భీమాను ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిన్న రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సిట్ ప్రధాన అధికారి ప్రణబ్ మొహంతీ అతడిని విచారించారు. మాయమాటలతో మొత్తం వ్యవస్థను నమ్మించి చివరికి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడని ఈ దర్యాప్తులో విచారణ బృందం గుర్తించింది. దీంతో అతడిని అరెస్టు చేసింది.

# నచ్చకపోతే మా ఉత్పత్తులు కొనకండి ట్రంప్ ఆంక్షలపై జైశంకర్ కౌంటర్

ప్రయోజనాలను రక్షించడమే మాకు ప్రధానం. దీనిపై మేం రాజీపడే ప్రసక్తే లేదు. వ్యాపార అజెండాతో సాగుతున్న అమెరికా యంత్రాంగానికి మద్దతిస్తున్న కొన్ని దేశాలు ఇతరులపై నిందలు వేసే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం. నిజంగా మీకు భారత్‌తో సమస్య ఉంటే.. మా చమురును, శుద్ధి చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయకండి. వాటిని కొనాలని మిమ్మల్ని ఎవరూ బలవంతం చేయట్లేదు. మీకు నచ్చకపోతే కొనకండి" అని జైశంకర్ అన్నారు. అంతేగాక, ట్రంప్ అదనపు సుంకాలుప్రకటించడానికి ముందే.. రష్యా చమురు అంశం గురించి అమెరికాతో తాము ఎలాంటి చర్చలు జరపలేదని వెల్లడించారు.

దేశ ప్రయోజనాలతో పాటు ప్రపంచ అవసరాలను దృష్టిలోఉంచుకునే తాము మాస్కో నుంచి చమురును కొనుగోలు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. "2022లో చమురు ధరలు భగ్గుమన్నాయి. దీంతో అంతర్జాతీయంగా ఆందోళన నెలకొంది. అప్పుడు రష్యా చమురును భారత్ కొనాలనుకుంటే అందులో ఎలాంటి అభ్యంతరం లేదని ప్రపంచవ్యాప్తంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎందుకంటే దానివల్లే చమురు ధరలు స్థిరీకరిస్తాయని అందరికీ తెలుసు" అని జైశంకర్ వివరించారు. మాస్కోతో తాము వాణిజ్యం పెంచుకోవాలని అనుకుంటున్నట్లు విదేశాంగమంత్రి తెలిపారు. అయితే ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై ఇప్పటికే తమ వైఖరి స్పష్టంగా తెలియజేశామని, ఆ దేశాల మధ్య ఉద్రిక్తతలు త్వరగా చల్లారని ఆకాంక్షిస్తున్నట్లు స్పష్టంచేశారు.

**ఇలాంటి అధ్యక్షుడిని చూడలేదు..**

ఈసందర్భంగా ట్రంప్ విదేశాంగ విధానం గురించి జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుత అమెరికా అధ్యక్షుడిలా విదేశాంగ విధానాన్ని ఇంత బహిరంగంగా నిర్వహించిన ఏ అధ్యక్షుడినీ గతంలో మనం చూడలేదు. ఒక్క భారత్ విషయంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలతో ఆయన డీల్ చేస్తున్న విధానం.. అనాదిగా వస్తున్న సంప్రదాయ పద్ధతులకు చాలా దూరంగా ఉంది. ఇక, వాణిజ్య అంశాలతో పాటు వాణిజ్యేతర వ్యవహారాలకూ టారిఫ్‌లను వినియోగించడం కాస్త కొత్తగా అనిపిస్తోంది" అని కేంద్రమంత్రి అన్నారు.

# రౌడీషీటర్ శ్రీకాంత్ వ్యవహారం.. భవిష్యత్తులో ఎవరికీ పెరోల్ సిఫారసు చేయను: కోటంరెడ్డి

సిఫారసు లేఖ ఇచ్చానన్నారు. వివిధ సమస్యల్లో వచ్చేవారికి ఎమ్మెల్యేలు లేఖలు ఇస్తారని పేర్కొన్నారు. అధికారులు వాటిని పరిశీలించి సమాధానం చెబుతారన్నారు. తానిచ్చిన లేఖను తిరస్కరిస్తూ జులై 16న అధికారులు సమాధానం పంపారని వివరించారు. జులై 30న అధికారులు పెరోల్ మంజూరు చేశారన్నారు. తమ లేఖను తిరిస్కరించి 14 రోజుల తర్వాత పెరోల్ మంజూరు చేశారని చెప్పారు.

"పెరోల్ అంశంపై విచారణ చేయిస్తున్నామని హోంమంత్రి చెప్పారు. నా సిఫారసు లేఖను తిరస్కరించిన 14 రోజుల్లోనే అధికారులు ఎలా పెరోల్ ఇచ్చారో? వైకాపా హయాంలో ఇదే శ్రీకాంత్‌కు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య లేఖలు ఇచ్చారు. వాటిని ఆధారం చేసుకుని పెరోల్ కూడా ఇచ్చారు. సిఫారసు లేఖలు ఇవ్వడమే తప్పుగా చిత్రీకరిస్తున్న వైకాపా.. అప్పుడు శ్రీకాంత్‌ను ఎలా బయటకు తెచ్చింది? ఎమ్మెల్యేలు ఇచ్చిన లేఖలను నేను తప్పుపట్టను. లేఖలు సాధారణం, అధికారులు నిర్ణయం తీసుకుంటారు. రాజకీయ జీవితంలో ప్రతిదీ గుణపాఠమే. ఇకపై భవిష్యత్తులో ఎవరికీ పెరోల్ సిఫారసు చేయను." అని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు.

# ఇండియా కూటమి అభ్యర్థికి చంద్రబాబు మద్దతిస్తారా?: బొత్స

పవన్‌లకు లేదా? అని నిలదీశారు. ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం కార్మిక, ప్రజా సంఘాలను కలుపుకొని త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని, అవసరమైతే ప్రధాని వద్దకు కూడా వెళతామని స్పష్టం చేశారు.

రాష్ట్రపతి ఎన్నికల విషయంలో వైసీపీ వైఖరిని వివరిస్తూ, సంఖ్యాబలం ఉన్నప్పుడు ఏకగ్రీవ ఎన్నికకు తాము ఎప్పుడూ మద్దతిచ్చామని తెలిపారు. ఇండియా కూటమి అభ్యర్థికి చంద్రబాబు మద్దతిస్తారా? అని ఆయన ప్రశ్నించారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన అన్ని రంగాల్లో విఫలమైందని బొత్స సత్యనారాయణ ఆరోపించారు. మంత్రులు, ఎమ్మెల్యేలపై అవినీతి ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో దోపిడీలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు పెరిగిపోయాయని విమర్శించారు. అర్హులైన దివ్యాంగుల పెన్షన్లను తొలగిస్తున్నారని, వారి సమస్యలపై ప్రభుత్వం మానవత్వంతో స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30లోగా దివ్యాంగుల సమస్యలు పరిష్కరించకపోతే, కలెక్టర్లను కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఇది సహజంగా ఏర్పడిన కొరత కాదు... కూటమి నేతలు సృష్టిస్తున్న కృత్రిమ సంక్షోభం: షర్మిల

దర్శనమిస్తున్నాయని షర్మిల తెలిపారు. వ్యవసాయ, విజిలెన్స్ శాఖలు ఈ అక్రమ రవాణాను ఎందుకు అడ్డుకోవడం లేదని నిలదీశారు. కూటమి ప్రభుత్వానిది సాగుకు పెద్దపీట వేయడం కాదని, రైతు మెడపై కత్తిపీట పెట్టడమేనని ఆమె ఘాటుగా విమర్శించారు.ఈ యూరియా సంక్షోభంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. బ్లాక్ మార్కెట్ దందాను తక్షణమే అరికట్టి, ప్రైవేట్ వ్యాపారులపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలని కోరారు. యూరియాను అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై నిత్యావసర వస్తువుల చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు అదనంగా అవసరమైన 1.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను వెంటనే సొసైటీల ద్వారా రైతులకు సరఫరా చేసి ఆదుకోవాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# ప్రకాశం పంతులు త్యాగాలు స్పూర్తిగా తీసుకోవాలి

సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్, ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎపి మాల వెల్ఫేర్ కార్పోరేషన్ చైర్మన్ డాక్టర్ విజయకుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణలతో కలిసి మంత్రి స్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమడు సంతోష్ కుమార్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏబీఎం కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పింగళి పాండురంగారావు రచించిన జాతీయ స్థాయి ధీరుడు టంగుటూరి ప్రకాశం పుస్తకాన్ని మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో తనదైన ముద్ర వేసిన ధీరుడు టంగుటూరి అన్నారు. న్యాయవాదిగా ఎంతో ప్రాక్టీసు ఉన్నా స్వాతంత్ర్య పోరాటం కోసం త్యాగం చేసిన వ్యక్తి టంగుటూరి అన్నారు. ఆయన త్యాగాలను స్పూర్తిగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతి,వర్ధంతులను ఘనంగా నిర్వహిస్తోందన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగాలను స్పూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని పురస్కరించుకొని శనివారం ఒంగోలు కలెక్టరేట్లోని వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగిందన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్రం కోసం, దేశం కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ నేటి యువత వారిఆశయాలను స్పూర్తిగా తీసుకోవాలన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు నుంచి మనం నేర్చుకోవాల్సింది త్యాగ గుణం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి సిహెచ్ ఓబులేసు, ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిటిసి సుశీల, డిసిఓ పద్మశ్రీ, డిఆర్డిఏ పిడి నారాయణ, మునిసిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మధుసూదన్‌రావు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.





# పొదిలి పట్టణంలో.... విగ్నేష్ రెడ్డి - కాలేషా స్నేహ బంధానికి నిదర్శనం

యువనేత విఘ్నేష్ రెడ్డి 25వ జన్మదిన వేడుకలు పొదిలి పట్టణంలో ఆదివారం విశేషంగా జరగనున్నాయి. పట్టణంలో విఘ్నేష్ రెడ్డికి అంకితమై ఏర్పాటు చేసిన 25 అడుగుల భారీ కట్ అవుట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కట్ అవుట్ రూపంలో కాలేషా తన గౌరవాన్ని, భక్తిని ప్రదర్శించగా, విఘ్నేష్ రెడ్డి పట్ల తన విశ్వాసం ఎంత బలంగా ఉందో మరోసారి చూపించారు. స్థానికంగా ప్రజలు ఈ అనుబంధాన్ని "స్వామి - భక్తి" బంధంగా వ్యాఖ్యానిస్తుండగా, విఘ్నేష్ రెడ్డి - కాలేషా స్నేహం పార్టీ బలోపేతానికి, స్థానిక యువతలో ఆత్మవిశ్వాసానికి దారితీస్తుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాలేషా తన భక్తిని గౌరవ సూచకంగా చూపించడం ఈ స్నేహానికి సజీవ సాక్ష్యంగా నిలిచింది. మొత్తానికి పొదిలి పట్టణంలో ఏర్పాటు చేసిన 25 అడుగుల భారీ కట్ అవుట్ కేవలం జన్మదిన వేడుకలకు మాత్రమే కాకుండా, విఘ్నేష్ రెడ్డి - కాలేషా మధ్య ఉన్న నమ్మకం, విశ్వాసం, స్నేహబంధానికి ప్రతీకగా నిలిచింది.

# నేటి సమాజానికి టంగుటూరి ప్రకాశం మార్గదర్శకం

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి







**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఆగస్టు 23)**

నేటి సమాజానికి టంగుటూరి ప్రకాశం పంతులు మార్గదర్శకంగా నిలిచారని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకలు స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో శనివారం జరిగాయి. ఏర్పాటుచేసిన ప్రకాశం పంతులు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ కలిసి పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారి తుపాకులకు ఎదురొడ్డి గుండె చూపిన ధైర్యశాలి ప్రకాశం పంతులు సేవలు అనుసరణీయమని కలెక్టర్ అన్నారు. అత్యంత పేదరిక కుటుంబంలో జన్మించిన ప్రకాశం పంతులు బంధువుల ఇంట్లో ఉండి చదువుకున్నారని తెలిపారు. ఆయన తెలివితేటలను గుర్తించిన ఆ ఉపాధ్యాయుడు తనతోపాటు రాజమండ్రి కి తీసుకువెళ్లారన్నారు. ప్రకాశం పంతులకు చదువుకునే అవకాశం కల్పించడంతో ఉన్నతంగా ఎదిగారన్నారు. బ్రిటిష్ కాలంలో మొదట మున్సిపల్ చైర్మన్ గాను పనిచేశారని, తర్వాత న్యాయవాదిగా వృత్తిని కొనసాగించారన్నారు. బ్రిటిష్ కాలంలో న్యాయవాదిగా పనిచేయడం గొప్ప విషయం అన్నారు. అలాంటి వృత్తిని తృణప్రాయంగా వదిలి, ఇంటి నుండి కట్టుబట్టలతో స్వాతంత్ర ఉద్యమంలోకి చేరడం, స్వాతంత్రం సాధించేవరకు ఉద్యమంలో భాగస్వాములయ్యారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం జరిగే సమయంలో సైమన్ కమిషన్ వచ్చినప్పుడు బ్రిటిష్ తూటాలకు ఎదురుగా రొమ్ము విరిచి నిలిచిన గొప్ప ధైర్యశాలిగా ఆంధ్ర కేసరి చరిత్రలో నిలిచిపోయారన్నారు. దేశంలో ఎవరు చేయలేనంత గొప్ప సాహసం చేశారని, స్వాతంత్రం వచ్చిన తర్వాత ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా రెండున్నర సంవత్సరాలు పనిచేశారన్నారు. ప్రజలకు విశేష సేవలు అందించారని తెలిపారు. ఆయన ధైర్యం, సాహసం, నిజాయితీ, స్ఫూర్తి, నేటి తరానికి మార్గదర్శి అని వర్ణించారు. టంగుటూరి ప్రకాశం పంతులు యువతరానికి స్ఫూర్తిగా నిలిచారని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. ఆయన స్ఫూర్తితో స్వాతంత్ర ఫలాలు అట్టడుగునున్న ప్రజలందరికీ అందేలా ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రకాశం పంతులు ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇండో సోలార్ ప్రాజెక్ట్ ను వ్యతిరేకిస్తున్నాం



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 23)**

కరేడు రైతు ఉద్యమానికి ఆంధ్రప్రదేశ్ విద్యార్థి యువజన జేఏసీ జేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటించిన విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ కార్పొరేట్ కంపెనీ అయిన ఇండో సోలో కంపెనీ మూడు పంటలు పండే రైతులు భూమిని అప్పగించటాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి మీ సొంత ఊర్లో అయితే ఇవ్వగలరా అని ప్రశ్నించారు. ఇండో సోలో కంపెనీకి ప్రకాశం జిల్లా దొనకొండలో 36,000 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, గతంలో జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే దొనకొండ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే అభివృద్ధి చెందుతాయని తెలిపారని గుర్తు చేశారు. కానీ స్వార్థ ప్రయోజనాల కోసం 8345 ఎకరాలు భూమి ఇండో సోలార్ ప్రాజెక్ట్ కి ఇవ్వటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును ధనకొండలో ప్రకటించాలని డిమాండ్ చేస్తున్న కర్రేడు రైతులు ఉద్యమాన్ని రాష్ట్ర, దేశస్థాయికి తీసుకెళతామన్నారు. త్వరలో కరేడు ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాయపాటి జగదీష్ కోరారు. దళిత జాగృతి రాష్ట్ర అధ్యక్షులు రబ్బవరపు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధి ఇళ్ళను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జాన్సన్, కందుకూరు డివిజన్ కన్వీనర్ రాజా, ఈస్టర్ సందీప్ పాల్గొన్నారు.

# బ్లాక్, వైట్ బర్లీ పొగాకు పంట సాగు తాత్కాలిక నిషేధం

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఆగస్టు 23)**

బ్లాక్ బర్లీ, వైట్ బర్లీ పొగాకు పంట సాగును తాత్కాలికంగా నిషేధించినట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఆ మేరకు జిఓ ఆర్ టి నెం. 740 ఉత్తర్వులను ప్రభుత్వం అధికారికంగా జారీ చేసిందన్నారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఏడాది పాటు పొగాకు సాగు నిషేధించినట్లు కలెక్టర్ ప్రకటించారు. రైతులంతా ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం బ్లాక్ బర్లీ పొగాకు సంక్షోభంలో ఉన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తాత్కాలికంగా నిషేధాజ్ఞలు విధించిందన్నారు. ఈ విషయాలపై అన్ని గ్రామాలలో టామ్ టామ్ వేయించాలన్నారు. పొగాకు పంట వేయకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఎన్ఫోర్స్మెంట్ టీములను నియమించామన్నారు. జిల్లా స్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, సంయుక్త కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి, లా అధికారి పనిచేస్తారన్నారు. నియమించిన బృందాలు క్షేత్రస్థాయిలో నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఒక్క ఎకరా పొగాకు పంట వేయకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులు, ఎన్ఫోర్స్మెంట్ అధికారులపై ఉందన్నారు. ఎక్కడైనా రహస్యంగా వైట్ బర్లీ, బ్లాక్ బర్లీ పొగాకు పంటలు వేస్తే వెంటనే పెరికి వేయాలన్నారు. నర్సరీలలో పొగనారు వేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ఏడాది పాటు పొగాకు పంట వేయరాదని సూచించారు. బ్లాక్ బర్లీ పొగాకు పంటను 1,500 టన్నులు మార్క్ ఫెడ్ ద్వారా కనుగోలు చేశామన్నారు. పంటల సాగును దృష్టిలో ఉంచుకుని రైతుల కొరకు ఎరువులు, పురుగు మందులు సమృద్ధిగా ఉంచామని కలెక్టర్ చెప్పారు. గ్రామాలలో ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడానికి వ్యాపారులు ప్రయత్నిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నల్ల బజారు పూర్తిగా అరికట్టాలన్నారు. తహసిల్దార్, వ్యవసాయ శాఖ అధికారి, ఏ ఎస్ ఐ లను ఎన్ ఫోర్స్ మెంట్ టీమ్ లుగా నియమించామన్నారు. 25 బృందాలను నియమించగా ఎరువుల దుకాణాలన్ని తనిఖీలు చేయాలన్నారు. ఎరువులు అక్రమంగా నిల్వలు ఉంటే తక్షణమే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నియమించిన బృందాలన్నీ వారంలోగా నివేదిక సమర్పించాలన్నారు. యూరియా, డి ఏ పి ఎరువులు రైతులకు పూర్తిగా అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందరాద్దన్నారు. సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్లు ఎరువులను నిల్వ ఉంచితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. నల్ల బజారును పూర్తిగా అరికట్టాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలోని బృందాలను ఆర్డీవోలు, వ్యవసాయ శాఖ ఏడీలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్‌గౌడ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏడి అన్నపూర్ణ, ఆర్డీవోలు, తహసిల్దార్లు, పోలీస్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయాల వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం పంతులుని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

## జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)**

పౌరుషం, త్యాగం, ప్రతిభకు ప్రతీకగా నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులుని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆంధ్ర కేసరి 154వ జయంతిని పురస్కరించుకుని శనివారం దేవరంపాడులోని స్థూపం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రకాశం పంతులు, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా స్థానికులను ఉద్దేశించి జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ దమ్ముంటే కాల్చాలంటూ బ్రిటిష్ వారి తుపాకులకు ఎదురు నిలిచిన ధీశాలి ప్రకాశం పంతులు అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులుగారు తనదైన ముద్ర వేశారని ఆయన అన్నారు. అంతటి గొప్ప వ్యక్తి, త్యాగశీలి అయిన ప్రకాశం పంతులు గారి జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సవాళ్లకు ఎదురొడ్డి ధైర్యంగా ముందుకు సాగిన ప్రకాశం పంతులుని నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని, తాము ఎంచుకున్న రంగంలో విజేతలుగా నిలవాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ స్మారకం వద్ద రెండు ఎకరాల విస్తీర్ణంలో డ్వామా ఆధ్వర్యంలో పల్లెవనం ఏర్పాటు చేయిస్తామని ఆయన ప్రకటించారు. స్థూపం చుట్టూ పెండింగ్ లో ఉన్న ప్రహరీ గోడ నిర్మాణాన్ని కూడా త్వరలో పూర్తి చేయిస్తామని తెలిపారు. మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేలా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపిఓ గొట్టిపాటి వెంకట నాయుడు, డ్వామా పిడి జోసఫ్ కుమార్, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, పలువురు మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





# అంకితభావంతో పనిచేసిన వారికి అధికారులు, ప్రజల మన్ననలు



**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 23)**

మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న సింగారెడ్డి లక్ష్మిరెడ్డి అంకితభావంతో, శ్రద్ధ ఆశక్తులతో, తమ వృత్తి నే ఆరాధ్య దైవంగా భావించి విధి నిర్వహణగావిస్తున్న లక్ష్మిరెడ్డికిస్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సంబంధిత అధికారులు ఈయన పనిచేసిన అన్ని చోట్లపరిశీలించి, మెచ్చుకొని, మంచివారికి అంతా మంచే జరుగుతుందన్న సామెత గా ప్రభుత్వం గుర్తించడం జరిగింది. దీంతో రాష్ట్ర మంత్రి డోలబాలవీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ తమీ మ్ అన్సారియా, జెసి గోపాలకృష్ణల చేతుల మీదుగా అవార్డును, ప్రశంసా పత్రాన్ని పొందారు. దీంతో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్‌తో పాటు సిబ్బంది, మండల ప్రజలు ఈయనను అభినందించారు.

# సకాలంలో స్పందించి ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఆగస్టు 23)**

మార్కాపురం పట్టణానికి చెందిన తనీర్ సురేంద్ర కుటుంబ సమస్యల కారణంగా శనివారం ఉదయం 10 గంటలకు “తాను చనిపోతున్నానని చెప్పి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, రైల్వే ట్రాక్ వైపు వెళ్లాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న తన అక్క వెంటనే మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్ అధికారులకు సమాచారం తెలియపరిచినది. మార్కాపురం డీఎస్పీ గారు మరియు సీఐ గారి ఆదేశాల మేరకు, ఎస్సై అంకమ్మరావు, సిబ్బంది, ఐటీ కోర్ టీం సాయంతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సురేంద్ర ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. వెంటనే రైల్వే ట్రాక్ వద్దకు చేరుకొని అతని ప్రాణాలను కాపాడడం జరిగింది. ఆ తర్వాత అతనికి కౌన్సిలింగ్ నిర్వహించి, మానసికంగా ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెంటనే స్పందించి సదరు వ్యక్తి యొక్క ప్రాణాలను చాకచక్యంతో కాపాడిన పోలీసులకు అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. విధి నిర్వహణలో మంచి పనితీరు కనబర్చిన మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్ అంకమ్మరావు, వారి సిబ్బంది కానిస్టేబుల్స్ కాశీరావు, రంగనాయకులు, ఐటి కోర్ సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అభినందించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 23)**

ఉలవపాడు జివిఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివిఎల్ సుధారాణి అధ్యక్షతన హిస్టరీ విభాగం ఇంచార్జ్ సి హెచ్ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు బాల్యం పేదరికంతో గడిచినదని, పట్టుదలతో ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయినారు. ఆయన స్వాతంత్ర సంగ్రామంలో ఆంధ్ర కేసరిగా పేరు గడించెను. ఆయన జ్ఞాపకార్థం ప్రకాశం పంతులు పేరు మీద జిల్లా పేరు పెట్టారు. అంతే కాకుండా ఆంధ్ర కేసరి యూనివర్సిటీ, ప్రకాశం బ్యారేజీలకు, ఆయన నామకరణం చేశారని ప్రిన్సిపాల్ వివరించెను. చరిత్ర అధ్యాపకులు మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవిత ఘట్టాలను, స్వాతంత్ర ఉద్యమంలో అతని త్యాగనిరతిని కొనియాడారు. ఇంగ్లీష్ అధ్యాపకులు మాట్లాడుతూ ప్రకాశం పంతులు గొప్పతనం, దార్శనికత కలిగినవాడని కొనియాడారు. ఐ.కి.ఏ.సి కోఆర్డినేటర్ మాణిక్యరావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు ఆదర్శవంతమైన జీవితాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు ప్రకాశం పంతులు జీవితాన్ని కొనియాడుతూ ఉపన్యసించారు.

## కనిగిరి డిపోలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 23)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, కనిగిరి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం "స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర" ప్రత్యేక కార్యక్రమాన్ని కనిగిరి డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో ప్రాంగణం, బస్సులు మరియు పరిసరాలను శుభ్రపరచడంతో పాటు, ప్రయాణికులకు, ఉద్యోగులకు శుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ స్వచ్ఛతే సేవ, పర్యావరణమే భవిష్యత్తు అన్న నినాదంతో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని స్వర్ణాంధ్ర సాధనలో శుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఉందని అన్నారు. ప్రతి ప్రయాణికుడు ఆర్ టి సి బస్సులను శుభ్రంగా వాడితే, మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించగలమని డి పి టి ఓ సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక శాసన సభ్యులు ఉగ్ర నరసింహా రెడ్డి డిపో అభివృద్ధి కి సహకరిస్తామని చెప్పడం జరిగిందని మన బాధ్యత తో డిపో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఉద్యోగులకు సూచనలు చేశారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లో శుభ్రత, పర్యావరణ పరిరక్షణ పట్ల మరింత అవగాహన పెంపొందించే ప్రయత్నం జరుగుతుందని కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి తెలిపారు. వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కలిగించారు. ప్రజా రవాణా ఉద్యోగులు చేత శుభ్రతపై స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, ఎస్‌టిఐ ఫణి కుమార్, శానిటేరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, గుడ్ హెల్ప్ రమేష్ బాబు, ఉద్యోగ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో ప్రకాశం పంతులు జయంతి



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 23)

మండల కేంద్రమైన ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ పాలకుడు డి. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్రకేసరి స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు 154 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. సందర్భంగా ఆ మహనీయుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ యాప్స్, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

## వాట్సాప్‌లో వచ్చే తెలియని లింక్స్, ఎపికె ఫైల్స్ క్లిక్ చేయద్దు

**ఈజి మనీ కోసం ఆశపడకండి**

**యాప్స్ ఓపెన్ చేసేటప్పుడు ఒక్కసారి ఆలోచించండి**

**సైబర్ నేరాల అవగాహన పై త్వరలో ప్రజసదస్సులు**

**ఎస్ఐ ప్రేమ్ కుమార్**




(షణ్ముఖ వెలుగు, కొండపి, ఆగస్టు 23)

సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వివిధ రకాల వాట్సాప్ గ్రూప్స్ లో మరే ఇతర తెలియని లింక్స్ కాని ఎపికె పైల్స్ గాని క్లిక్ చేయవద్దని ఆయన తెలిపారుముఖ్యంగాఈ యాప్స్ పై ఇప్పటికే యువతకి ప్రత్యేక ఆవగాహనకలుగ జేస్తున్నామనికళశాలలో,పాఠశాలలోవిద్యార్థులకువివరిస్తున్నామని ఆయన తెలిపారు. బివివిదరకాల యాప్స్ ద్వార డబ్బులుపోగొట్టుకుంటున్నరన్న విషాయాలు తెలుస్తున్నాయని అయితే ఇప్పటి వరకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయలేదని ఆయన తెలిపారు. ప్రజలకు అవగాహన కొసం పట్టణంలోని ప్రధానకుడళ్ళలో సమావేశపరిచి త్వరలో ఆవగాహన కల్పస్తామని ఆయన తెలిపారు. ఒకసారి ఆన్లైన్లో డబ్బులు పొగొట్టుకున్న తరువాత వాటిని తిరిగి పొందాలంటే చాల కష్టతరమని కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కొరారు. ఎవరైనా ఆన్ లైన్లో డబ్బులు పొగొట్టుకుంటే వెంటనే సైబర్ క్రైం కు సమాచారం అందించాలని ఆయన కోరారు. డబ్బులు ఎవ్వరికి ఉరికే రావని ఈజిమని కొసం అడ్డదారులు తొక్కితే అసలుకే మోసం వస్తుందని ఆయన తెలిపారు.ఏదైనా ప్రజలు అప్రమత్తంగా ఉండి తెలియని లింక్స్,డబ్బుసంబంధిత కార్యాలపాల పట్ల జాగురకతో ఉండాలని కొండపి ఎస్ఐ ప్రేమ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. శనివారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్, ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎపి మాల వెల్ఫేర్ కార్పోరేషన్ చైర్మన్ డాక్టర్ విజయకుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణలతో కలిసి మంత్రి స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత డిసెంబర్ మాసం నుండి ప్రతి నెలా మూడవ శనివారం ఒక్కొక్క నెల ఒక్కొక్క థీమ్‌తో స్వర్ణ ఆంధ్ర ,స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 3వ శనివారం కృష్ణాష్టమి పండుగ రావడంతో 4వ శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. హాండ్స్ క్లీనింగ్, డ్రైన్ క్లీనింగ్ ప్రధానాంశంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా డ్రైన్స్ క్లీనింగ్ చేయడం, దోమల నివారణకు మందులు స్ప్రే చేయడం, నీటి నాణ్యతలను పరీక్షించడం, హాండ్ వాష్ పై అవగాహన కలిగించడం తదితర కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. గత మాసంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నివారించే అంశంతో కార్యక్రమాన్ని జరుపుకోవడం జరిగిందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో డ్రాయింగ్ ఆఫీసర్ ను యూనిట్‌గా తీసుకొని ఒక నిబద్ధతతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సమాజంలో పరిసరాలు పరిశుభ్రతతో ప్రశాంత జీవనం సాగిస్తున్నామంటే పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. పారిశుధ్య కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుచున్నదని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఓబులేసు, ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, ఒంగోలు మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.







## స్వామిత్వ సర్వే పనులు అధికారులు శరవేగంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి**





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఆగస్టు 23)

స్వామిత్వ సర్వే పనులను అధికారులు శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. స్వామిత్వ సర్వే, పి 4 అమలు, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయం వంటి అంశాలపై డివిజన్ మండల స్థాయి అధికారులతో శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం ద్వారా మాట్లాడారు. స్వామిత్వ సర్వేలో డ్రోన్ చిత్రాలను పిపిఎం ఆధారంగా కొలతలు సరి చూడాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. స్వామిత్వ సర్వేలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను క్యూజిఐఎ సాఫ్ట్ వేర్ అనుసంధానంతో పరిష్కరించాలన్నారు. డ్రోన్ సర్వే, సర్వేర్లతో చేపట్టే ఫిజికల్ సర్వేలో తారతమ్యాలు లేకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కార మార్గం చూపాలన్నారు. పంచాయతీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. చీరాల, వేటపాలెం, ఇంకొల్లు, చిన్నగంజాం, రేపల్లె, కర్లపాలెం, పి.వి పాలెం, పర్చూరు, మార్టూరు, చెరుకుపల్లి, రేపల్లె, నగరం, చుండూరు మండలాల్లో స్వామిత్వ సర్వే ఆశించిన స్థాయిలో జరగడంలేదని అసహనం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతాలలో సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే పురోగతికి డి ఎల్ డి ఓలు బాధ్యులని స్పష్టం చేశారు. స్వామిత్వ సర్వేపై ప్రతిరోజు మండల స్థాయిలో సమీక్షలు జరగాలన్నారు. పర్యాటక దినోత్సవాన్ని వైభవంగా జరపడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. జిల్లాలో సూర్యలంక బీచ్ లో బీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహిస్తున్న విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పి 4 అమలులో బంగారు కుటుంబాలకు ఎలా సహాయక చర్యలు చేపట్టాలో మార్గదర్శిలకు అవగాహన కల్పించాలన్నారు. అమలులో పురోగతి కనిపించాలన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజా స్పందనపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజలకు మంచి సేవలు అందించడానికి ప్రభుత్వ ఉద్యోగులు స్ఫూర్తితో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడి కనక ప్రసాద్, ఆర్డీవోలు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అనర్హుల పేరిట దివ్యాంగుల పెన్షన్ల తొలగింపు సరే..

**అర్హత లేకపోయినా సదరం సర్టిఫికెట్ మంజూరు చేసిన డాక్టర్ల పై చర్యలు లేవా?**

**తీవ్రంగా ఖండించిన నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి**

**జిల్లా అధ్యక్షులు ముల్లా మదర్ వలి**



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 23)

ప్రభుత్వాలు మారిన దివ్యాంగుల బతుకుల్లో ఎటువంటి మార్పు లేదు. కనపడక, వినపడక, మాట్లాడలేని, నడవలేని దివ్యాంగులకు ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ ప్రామాణికంగా తీసుకొని సామాజిక పెన్షన్ లను ఇస్తుంది. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి ఎటువంటి తేడా లేదు. గత ప్రభుత్వం అకారణంగా పలు సాకులు చూపి (300 యూనిట్లు, కారు, కరెంట్ మీటర్, ఇన్కమ్ టాక్స్ రిటర్న్, భూమి, ఇల్లు అవుట్ సోర్సింగ్ పోస్ట్) సుమారు లక్షమంది దివ్యాంగుల పెన్షన్ తీసివేయడం జరిగింది. మేమేమీ తక్కువ కాదు అని ప్రస్తుత కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ (బోగస్) రీ వెరిఫికేషన్ జరిపి ఒక లక్ష 8 వేల మంది దివ్యాంగుల పెన్షన్ లకు కోత విధించింది.

# అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**బాధితులకు న్యాయం చేయాలి**

**అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)

అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, వారి సమస్యలను పరిష్కరించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒంగోలులోని అంబేద్కర్ భవనంలో శనివారం అగ్రి గోల్డ్ బాధితుల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొందుపరిచారు అన్నారు. చంద్రబాబు నాయుడు మాటలు నమ్మి రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ బాధితులు కూటమికి ఓటు వేసి గెలిపించుకున్నారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిన అగ్రిగోల్డ్ బాధితుల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా మారిందన్నారు. ఒక సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీ పని చేస్తున్న సమయంలో రియల్ ఎస్టేట్ ప్లాట్‌లను, ఫామ్ ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న బాధితుల భూములను ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ అటాచ్మెంట్ నుంచి తొలగించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ సిఐడి టీముని ఏర్పాటు చేసి, వారిని ఎటువంటి ట్రాన్స్ఫర్లు చేయకుండా సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. అగ్రిగోల్డ్ ఆస్తులను ఆర్డర్ సంస్థ ద్వారా విలువలు లెక్కించారని కోరారు. అలాగే అగ్రిగోల్డ్ భూములను వేలం ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వివి నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి తిరుపతిరావు, ప్రకాశం జిల్లా గౌరవ అధ్యక్షులు వి హనుమారెడ్డి, డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన అగ్రిగోల్డ్ బాధితుల నాయకులు ఆరేళ్లమ్మ, మాణిక్యాలరావు, శేషు కుమార్ రెడ్డి, రాంబాబు, నాగలక్ష్మి, జగన్, మంత్రి నాయక్, సుబ్బారావు, రామదాసు, శంకరయ్య, బెల్లంకొండ శ్రీనివాస్, ముని శంకర్, ఖాదర్ భాషా, మల్లికార్జున, భద్రం, కుమార్, బుడిత అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి










(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఆగస్టు 23)

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, శాసనస భ్యులు వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రత కోసం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందని ఆయన అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణం 57 ఎకరాల మేర భూమి ఉందని ఈ ప్రాంతాన్ని అంతా కూడా శుభ్రం చేయడానికి చర్యలు చేపట్టామని ఆయన చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర దిశగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని అన్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టిన సంస్థలకు అవార్డులు ప్రదానోత్సవం చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాల యాల్లో, పాఠశాలల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, హాస్టల్లో స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని ఆయన చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ప్రధానం చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ వెంకటమురళి, శాసనసభ్యులు నరేంద్ర వర్మ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ప్రాంగణం మొత్తం వెయ్యి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో బాపట్ల శాసన సభ్యులు వేగేసశన నరేంద్ర వర్మ, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామ రెడ్డి, ఎక్సైజ్ శాఖఇ. ఎస్ వెంకటేశ్వరరావు, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్రావు, జిల్లా ప్రణాళిక అధికారి షాలోమ్ రాజు, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు, పురుగుమందుల దుకాణాల పై ఇంటర్నల్ స్క్వాడ్ ఆకస్మిక తనిఖీ







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 23)

మండలంలోని పలు ఎరువులు పురుగుమందుల దుకాణాలను శనివారం ఇంటర్నల్ స్క్వాడ్ ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా ఫరం లేని దాదాపు రూ.2 లక్షల సరుకు అమ్మకాలు నిలిపివేయడం జరిగింది. తనిఖీ అధికారి కావలి నాగరాజు మాట్లాడుతూ ఎరువులు పురుగుమందుల వ్యాపారులు సరియైన పత్రాలు కలిగివుండాలని, ఎరువులు, పురుగుమందుల ను నిర్ణయించిన ధరకు మించి అమ్మరాదని, నిర్లక్ష్యం వహించినట్లయితే యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుని లైసెన్స్ కూడా రద్దు చేయబడుతుందని హెచ్చరించారు. వీరి వెంట కందుకూరు, ఉలవపాడు వ్యవసాయఅధికారులు అబ్దుల్ రహీం,విజయకుమార్ పాల్గొన్నారు.

# రాష్ట్ర అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరు పెట్టడం పై హర్షం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)

1973లో జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వం ప్రధాన పరిపాలనా శాఖలో ఒక ప్రత్యేకాధికారిని నియమించి అధికార భాషగా తెలుగు అమలు కోసం ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఆ అధికార భాషా శాఖను అప్పటి విద్యా మంత్రి మండలి వెంకట కృష్ణారావుకు అప్పగించింది. వారు ఆ శాఖకు చేసిన సేవకు, తెలుగు భాషకు చేసిన సేవకు గుర్తింపుగా నేడు మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము రాష్ట్ర అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరు నిర్ణయించినందుకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరు నిర్ణయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కి,రాష్ట్ర మంత్రివర్గానికి ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కళామిత్రమండలి తెలుగు లోగిలి సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చేముందు తెలుగు భాష అభివృద్ధికి సేవలు చేస్తామన్న వాగ్దానాలు నిలబెట్టుకుని తెలుగు భాష ఉనికికి, మనుగడకు చేస్తున్న అభివృద్ధిలో భాగంగా శనివారం “మండలి వెంకటకృష్ణారావు తెలుగు అధికార భాషా సంఘం” గా ప్రకటించడం పట్లచాలా సంతోషంగా ఉందని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, శ్రీకృష్ణదేవరాయ సంస్థ అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లికార్జునరావు, ప్రముఖ కవి యు వి రత్నం, ఓరుగంటి ప్రసాద్,కె.బాలకోటయ్య,బీరం అరుణ,నెమ్మాని సీతారామ మూర్తి, గుంటూరు సత్యనారాయణ, తన్నీరు బాలాజీ తదితరులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.తండ్రి అడుగు జాడల్లో నడుస్తున్న మండలి బుద్ధప్రసాద్ లాంటి వారిని అధికార భాషా సంఘం అధ్యక్షులుగా నియమిస్తే తెలుగు భాషకు మరింత కృషి చేస్తారని వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా కవులకు, రచయితలకు, కళాకారులకు తగిన సహకారం కూటమి ప్రభుత్వం అందించాలని కోరారు.

# జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా టంగుటూరి జయంతి వేడుకలు

### ఆంధ్రుల ఆవేశం... ఆత్మవిశ్వాసానికి ప్రతీక...ప్రకాశం పంతులు

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)

స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో బ్రిటిష్ వారి తుపాకీ కి ఎదురు నిలిచి గుండె చూపిన ధైర్యశాలి, ఆంధ్రుల ఆవేశానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీక టంగుటూరు ప్రకాశం పంతులునీ, ఆయన తెగువ, ధైర్యం, పోరాట స్ఫూర్తి, త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా అన్నారు. నేడు టంగుటూరి 153 వ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆయన అన్నారు ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నగరంలోని ప్రకాశం భవనం ప్రాంగణంలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి, అలాగే లాయర్ పేట లోని ఉన్న మరో కాంస్య విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రేణులతో కలిసి పూలమాలతో పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక ,కర్షక కాంగ్రెస్ అధ్యక్షులు దర్శి నియోజక వర్గ సమన్వయకర్త కైపు వెంకట కృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గోరంట్ల కోటేశ్వరరావు,జిల్లా లీగల్ సెల్ చైర్మన్ సుధర్సి రవి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లు ఇరిగినేని వెంకట నరసయ్య, షేక్ రఊఫ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, మద్దిపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గురు బాబు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.




# కాటంరాజు దేవస్థాన అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తా

## ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)

శ్రీ వేణుతల కాటంరాజు గంగాభవాని దేవస్థానం కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్ ఆధ్వర్యంలో పలువురు ఆలయ కమిటీ బాధ్యులు, జిల్లా యాదవ సంఘం నాయకులు ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాస్‌రెడ్డి ని కలిసి ఉగాది ముందు రోజు లక్షలాదిమందితో జరుగుతున్నటువంటి కాటంరాజు తిరుణాల సందర్భంగా తాగునీటి కొరత ఉందని, అందువలన శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి గురు ఆదివారాలలో విచ్చేయుచున్నటువంటి సుమారు 500 పైగా భక్తుల సౌకర్యార్థం ఆ ప్రాంతంలో సెల్ ఫోన్ సిగ్నల్ లేదని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నలమల అడవి ప్రాంతంలో ఉన్నటువంటి యాదవుల యాదవేతరుల ఆరాధ్య దైవమైనటువంటి శ్రీ కాటమరాజు గంగాభవాని దేవతల ఆలయ ప్రాంతమంతా సెల్ ఫోన్ సిగ్నల్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కూడా వారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అంతేగాక ఇప్పటికే దాతల సహకారంతో చిన్నపాటి భోజనశాల నిర్మాణం పూర్తయిందని, కానీ అది ఏమాత్రం భక్తులకు సరిపోవడం లేదని ప్రభుత్వం వారు స్పందించి 50 లక్షల రూపాయల తో ఒక కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయవలసినటువంటి అవసరం ఎంతో ఉందని కూడా ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అన్ని విషయాలను సావధానంగా విన్న మాగుంట తాను తక్షణమే ఇతర ప్రాంతాలకు ఇచ్చినట్టుగా ఆరు లక్షల రూపాయల వ్యయంతో శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తానని, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మాత్యులు గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర రావుకి రికమండేషన్ లెటర్ కూడా పంపిస్తానని, మిగతా అంశాల పైన స్థానిక తెలుగుదేశం పార్టీ ఇన్చార్జితో మాట్లాడి భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి తన వంతుగా సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోకపల్లె నరాల వెంకట్ నారాయణ యాదవ్ కూడా ఉన్నారు.

# మండల పార్టీ అధ్యక్షుడు సాంబశివరావును సన్మానించిన మండల నాయకులు





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 23)

పొన్నలూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా 2వ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన అనుమోలు సాంబశివరావుకు మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపి అనంతరం సన్మానించారు. సాంబశివరావు మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు రెండోసారి మండల టిడిపి అధ్యక్ష పదవికి సహకరించిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి కి, మారి టైం బోర్డ్ చైర్మన్ సత్య కి కృతజ్ఞతలు తెలిపారు. సాంబశివరావు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవి ఇచ్చినందుకు నేను మండలంలోని కార్యకర్తలకు నాయకులకు అందుబాటులో ఉండి పార్టీని మరింత బలోపేతం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు మండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మండవ ప్రసాద్, మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, మండవ మురళీమోహన్, సన్నమూరి నరసింహ, కాటూరి మాధవరావు, రమణయ్య, పిల్లి కృష్ణారెడ్డి, పిల్లి వెంకట నారాయణ రెడ్డి, మోరుబోయిన మాల్యాద్రి, గట్టబోయిన మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలి

## ఎస్ఐ అనుక్




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 23)

వినాయక చవితి వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ అనుక్ తెలిపారు. వినాయక చవితి వేడుకల సందర్భంగా పాటించాల్సిన నియమ నిబంధనలు తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు తెలిపారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా మండపాలు ఏర్పాటు చేయాలనుకునేవారు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. మండపాలను ఏర్పాటు చేసుకోవడానికి ముందస్తుగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమిటీ వారే అన్ని బాధ్యతలను చూసుకోవాలని అగ్ని ప్రమాదాల నివారణకు మండపాల వద్ద ఇసుక, నీళ్లు అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు మండపాల వద్ద అధిక శబ్ద కాలుష్యాన్ని కలిగించే స్పీకర్లు వినియోగించకూడదు స్పీకర్లు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకే వినియోగించుకోవాలని సూచించారు. వినాయక చవితి పర్వదినం ఉత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండాలని తెలిపారు.

# ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 23)
టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలు మండలంలోని జగన్నాథపురం గ్రామంలో స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కస్సెట్టి వెంకట జగన్ బాబు ఆధ్వర్యంలో ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశంపంతులు 1872వ సంవత్సరం, ఆగస్టు 23వ తేదీన ప్రకాశం జిల్లా, ఒంగోలుకు సమీపాన ఉన్న వినోదరాయునిపాలెం గ్రామంలో గోపాలకృష్ణయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. ఈయన కుచిన్నతనం నుండే ప్రజా సమస్యలు తీర్చేందుకు మంచి అవగాహన ఉండేది. దీంతో ఆయనకు లాయర్కావాలని ఉద్దేశం, పట్టుదల కలిగి ఉండడం జరిగింది. కానీ ఈయనకు చిన్ననాటి మిత్ర దోషం వల్ల మెట్రిక్యులేషన్ లో తప్పిపోవడం జరిగింది. హనుమంత రావునాయుడుఅనే ఉపాధ్యాయుడు రాజమండ్రి కి తీసుకెళ్లి ఎలాంటి ఫీజు లేకుండా మరల మెట్రిక్యులేషన్ చదించడం జరిగింది. అనంతరం న్యాయవాద వృత్తిని చదివేందుకు మద్రాస్‌కు వెళ్లడం జరిగింది. దీంతో సెకండ్ గ్రేడ్ప్లిడర్ అవ్వడం జరిగింది. 1890 సంవత్సరంలో తన అక్క కూతురు అయిన



అనుమాయమ్మతో వివాహం జరిగింది. అనంతరం ఒంగోలులో కొంతకాలం లాయర్ గా పనిచేసి అనంతరం రాజమండ్రి కి వెళ్లి అక్కడ మంచి అడ్వకేటుగా రాణించి, ఆర్థికంగా బలపడటం జరిగింది. అనంతరం రాజమండ్రి పురపాలకసంఘానిక అధ్యక్షులుగా నియమితుడయ్యారు. ఈయన మద్రాస్‌లో వాదించి గెలవడం మూలాన ఈయన తెలివితేటలకు సెకండ్ గ్రేడ్ప్లిడర్ నుండి ప్రకాశం పంతలు మొట్టమొదటి వాడిగా బారిష్టర్‌కు ఎంపికై హైకోర్టుకు లాయర్‌గా రావడం జరిగింది. ఇతర దేశాలైన ఇంగ్లాండు, లండన్ లలో ఇంకా పై చదువులు పూర్తి చేసుకుని, తిరిగి మద్రాస్ హైకోర్టుకు వచ్చి మంచి క్రిమినల్, సివిల్ లాయర్‌గా మంచి పేరు గడించారు. న్యాయవాది వృత్తిని వదిలేసి స్వరాజ్య అనే వార్తదినపత్రికకు ఎడిటర్‌గా పనిచేయడం ప్రారంభించారు. ఈ పత్రిక తెలుగు, తమిళం, ఇంగ్లీష్ భాషలలో ప్రచురించడం జరిగింది. 1922వ సంవత్సరంలో సహాయా నిరాకరణోద్యమంలో, 1928 వసంవత్సరంలో సైమన్ కమిషన్ ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ వారికి ఎదురు తిరిగిన వ్యక్తిగా గుర్తింపు పొందాడు. ప్రకాశం పంతులుగారు చేసిన ధైర్య సాహసాలకు ఆంధ్ర కేసరి అని బిరుదు పొందడం జరిగింది. దీంతో 1946వ సంవత్సరంలో 11 నెల ల పాటు ముఖ్యమంత్రి గా ఉండి స్వాతంత్రానంతరం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఆనాటి ప్రభుత్వం ఈయనను మొట్టమొదటి ముఖ్యమంత్రి గా ఎన్నుకోవడం జరిగింది. ఈయన అంచలంచలేక ఎదగడంతో ఈ మహానుభావుడి జ్ఞాపకార్థంగా ప్రకాశం జిల్లాగా పేరు పెట్టడంజరిగిందనిప్రధానోపాధ్యాయులు జగన్ బాబు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

## లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాల వద్ద స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 23)
మండలంలోని లింగారెడ్డి కాలనీలో ప్రభుత్వం ఆదేశముల మేరకు శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమం లో వర్షాకాలంలో కలిగే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చేతుల శుభ్రత పాటించి, ఆరోగ్య సూత్రాలను పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాలి,ఉపాధ్యాయురాలు అలివేలుకుమారి, పాఠశాల చైర్మన్ పులివేముల రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)
ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ప్రకాశం జిల్లా వాసి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి సందర్భంగా 35 డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య వారి ఆధ్వర్యంలో లాయర్పేటలోని ప్రకాశం పంతులు విగ్రహానికి ఒంగోలులోని బ్రాహ్మణ ప్రముఖులు వచ్చి వారికి పూలమాలతో గౌరవించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు నగర కమిషనర్ గారు పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో టీవీ శ్రీరామ్ మూర్తి, కుసుమకుమారి, ఎస్సేటి రాజేష్, దేనువుకొండ సుబ్బయ, జి రామారావు, జివిఎస్ఆర్, కత్తుల శివ శంకర్, ఎం మారుతి, ముక్తినూతలపాటి వాసు, యు వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## సర్వీస్ కోట అమలయ్యేలా చూడాలి

### ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాటమాల రాహుల్



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఆగస్టు 23)
రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న ఇన్సర్విస్ డాక్టర్ల పీజీ కోటాను 20 శాతం నుండి 15 శాతానికి తగ్గించడాన్ని నిరసిస్తూ, ప్రస్తుతం అమలవుతున్న 20 శాతాన్ని యధాతథంగా కొనసాగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్. కాటమాల రాహుల్ వారి అసోసియేషన్ సభ్యులతో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు గారికి వినతి పత్రం సమర్పించారు. కేవలం 7 శాఖలలో సర్వీసు కోట కాకుండా గతంలో మాదిరిగా అన్ని శాఖలలో సర్వీస్ కోట అమలయ్యేలా చూడాలని జనరల్ సెక్రటరీ డాక్టర్. ఖాదర్ మస్తాన్ బి తెలిపారు. గత సంవత్సరం చర్చల సందర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా సర్వీస్ కోట తగ్గించే ఉద్దేశం ఉన్న యెడల అసోసియేషన్ ప్రతినిధులతొ సంప్రదింపులు జరిపిన తరువాత మాత్రమే తగ్గింపు నిర్ణయం తీసుకుంటామని ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించి ఇప్పుడు ఏకపక్షంగా సర్వీస్ కూడా తగ్గించడం బాధాకరమని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుందర్ ప్రసాద్ అన్నారు. గిరిజన, పల్లె ప్రాంతాల్లో సంవత్సరాలుగా పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్ల కెరీర్ పై సర్వీస్ కోట తగ్గింపు నిర్ణయం అశనిపాతమని అసోసియేషన్ సభ్యులు డాక్టర్ నబీవలి అన్నారు. ప్రస్తుతం అమలవుతున్న 20 శాతం సర్వీస్ కోటాను యధాతరంగా కొనసాగించాలని డాక్టర్ కుమారస్వామి ప్రభుత్వాన్ని కోరారు.

## రైళ్లలో పోలీసులు విస్తృత తనిఖీలు

## పూరి ఎక్స్ప్రెస్‌లో నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

### గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం రవాణా పై ఉక్కుపాదం మోపుతున్న ప్రకాశం పోలీసులు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)
గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు, స్పెషల్ పార్టీ, ఈగిల్ టీం, ఆర్పీఎఫ్ , జీఆర్పీ సిబ్బంది, మాదకద్రవ్యాలను గుర్తించే డాగ్ స్క్వాడ్ తో కలిసి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల బోగీలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్సెల్ కేంద్రాలు తదితర ప్రదేశాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన పార్సిళ్లు, ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులు, ఇతర వస్తువులను ఒక్కొక్కటిగా తనిఖీ చేశారు. పూరి ఎక్స్ప్రెస్‌లో నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు అనుమానితుల వ్యక్తులను అదుపులోకి తీసుకొని తదుపరి దర్యాప్తు నిమిత్తం జి ఆర్ పి పోలీసులకు అప్పగించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసే, విక్రయించే, వినియోగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266 కు తెలియజేయవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు శ్రీకాంత్, చెంచయ్య, ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులు, ఈగిల్ టీం, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

### మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్




(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 23)
కనిగిరి పట్టణంలోని 5వ సచివాలయంలో శనివారం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో 79 వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా చేతుల మీదుగా రెండవ సారి ఉత్తమ అవార్డు అందుకున్న వి.ఆర్.ఓ బసిరెడ్డి శ్రీకాంత్ ను కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ప్రత్యేకంగా సన్మానించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలని అన్నారు.వి ఆర్ ఓ శ్రీకాంత్ తన కృషి,సేవా భావం, సమాజానికి అందించిన విశిష్టమైన సేవలు కారణంగా ఈ అవార్డు లభించిందని సమాజంలో ఇలాంటి ఆదర్శవంతులైన వ్యక్తులు మరింతమందికి స్ఫూర్తి నింపుతారని అభినందించారు.సన్మాన కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు,గౌరవ అతిథులు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొని అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు తెలిపారు.అంతరం ఐ టి డి పి రాష్ట్ర ఉపాధ్యక్షులు జాంషీర్ అహమ్మద్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు గుడ్ హెల్ప్ రమేష్ బాబు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మస్తాన్ వలి, స్థానిక ప్రజలు నాగురబీ, గౌస్ బాష, రహిమాన్,సన్మాన గ్రహీతకు పూల మాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# టంగుటూరి ప్రకాశం పంతులు

## జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం

### జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)
స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి బిరుదాంకితుడు స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన అర్పించి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 1872 ఆగష్టు 23న ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం, వినోదరాయుని పాలెము గ్రామంలో సుబ్బమ్మ, గోపాల కృష్ణయ్య దంపతులకు జన్మించారని, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడినప్పటికీ, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించారు. లండన్‌లో బారిస్టర్ పాసై ప్రముఖ న్యాయవాదిగా సేవలందించారని, కేవలం ఒక న్యాయవాదిగా మాత్రమే



కాకుండా, మద్రాస్ లో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో బ్రిటీష్ వారి తుపాకీకెదురుగా గుండె చూపించి ఆంధ్రకేసరిగా చిరస్థాయిగా నిలిచారని, నిబద్ధత, ధైర్యం, సమైక్యతకు నిదర్శనంగా బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడి స్వతంత్ర పోరాటంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఈ సంఘటన కేవలం ప్రకాశం వ్యక్తిగత ధైర్యానికే కాకుండా, భారత స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తికి కూడా ఒక గొప్ప చిహ్నంగా నిలిచిపోయింది. ప్రకాశం పంతులు జీవితం కేవలం స్వాతంత్ర్య పోరాటానికే పరిమితం కాలేదని, ఆంధ్ర రాజకీయాలలో వెలుగొందిన వ్యక్తులలో ప్రముఖుడని, ప్రత్యేకంగా రాష్ట్ర సాధనలో నిర్ణయక పాత్ర పోషించాడని, 1953 అక్టోబర్ 1న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా ప్రజాసేవకుడయ్యారని, ఆయన జాతికి చేసిన సేవలను గుర్తుగా 1972 డిసెంబర్ 5న ఒంగోలు జిల్లా పేరును ప్రకాశం జిల్లాగా మార్చారన్నారు. అలాంటి మహనీయులైన ప్రకాశం పంతులు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, పీసీఆర్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రత, శ్రేయస్సుకు కళాశాల యాజమాన్యాలు కృషి చేయాలి

## జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)

విద్యార్థుల సంక్షేమం, భద్రత,ర్యాగింగ్ కార్యకలాపాలు, గంజాయి, మాదకద్రవ్యాలు వాడకంపై కట్టుదిట్ట చర్యలు తీసుకోవడంపై దృష్టిసారిస్తూ, విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, సవాళ్లపై అవగాహన కల్పించడం, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలు, హాస్టల్ వార్డన్స్ మరియు విద్యార్థులతో జిల్లా ఎస్పీ గారు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆత్మహత్యలు, ర్యాగింగ్, వేధింపులు, సైబర్ నేరాలు, క్యాంపస్‌లో జరిగే అల్లర్లు, మరియు కుల, మత రాజకీయాల ప్రభావం వంటి సమస్యలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, కళాశాల యాజమాన్యాలు కేవలం విద్యా బోధనకే పరిమితం కాకుండా, విద్యార్థుల మానసిక, శారీరక క్షేమంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేందుకు దారితీసే ఒత్తిడి, అకాడమిక్ భారం, మరియు వ్యక్తిగత సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు కౌన్సిలింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మరియు వేధింపులు సమాజంలో తీవ్రమైన నేరాలని స్పష్టం చేశారు. ఈ నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కళాశాల యాజమాన్యాలు ఎలాంటి జాప్యం లేకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాశాలల్లో మహిళా భద్రతకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని, వాటి పనితీరును సమీక్షించాలని కోరారు. ఫిర్యాదులకు సంబంధించిన కంప్లైంట్ బాక్స్ ను ఏర్పాటు చేయాలని, సమస్యలపై నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చట్టాలు మరియు శిక్షలు గురించి తెలియచేసారు. హాస్టళ్లలో విద్యార్థుల భద్రతను పర్యవేక్షించడం చాలా ముఖ్యమన్నారు. హాస్టల్ మెస్, ఆహార నాణ్యత సమస్యలు విద్యార్థుల్లో అసంతృప్తిని పెంచుతాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. హాస్టల్ వార్డెన్లు, మెస్ నిర్వాహకులు నిరంతరం విద్యార్థులతో సంప్రదింపులు జరిపి, వారి అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. హాస్టళ్లలో రిజిస్టర్ ను నిర్వహించాలని, మాదకద్రవ్యాలు జోలికి వెళ్ళకుండా విద్యార్థులను చైతన్య పరచాలన్నారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే మోసాలు, బెదిరింపుల పట్ల జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించాలని,కళాశాల ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం, సిగరెట్లు, మరియు ఇతర మత్తుపదార్థాలకు దూరంగా ఉండేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని, క్యాంపస్‌లో మాదకద్రవ్యాల విక్రయాలను నిరోధించడానికి పోలీస్ సహకారం తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల మధ్య వైరం, సామాజిక వర్గాలు, కుల రాజకీయాలు, మరియు ప్రాంతీయ విభేదాలు క్యాంపస్‌లో అశాంతికి దారితీస్తాయని, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తాయని, వీటిని నివారించడానికి కళాశాల యాజమాన్యాలు సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు విద్యార్థుల భద్రత మరియు శ్రేయస్సుకు చాలా ముఖ్యమైనవని ఎస్పీ గారు అన్నారు. విద్యార్థులు భద్రంగా మరియు సౌకర్యవంతంగా తమ విద్యా జీవితాన్ని కొనసాగించేందుకు కళాశాల యాజమాన్యాలు మరియు పోలీస్ శాఖ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సమావేశాలు తరచుగా నిర్వహిస్తామని ఎస్పీ నిర్ణయించారు. విద్యార్థులు చదువుల్లో క్రమశిక్షణ ఎంతో అవసరమని, క్రమశిక్షణ లేకపోతే బంగారు భవిష్యత్తుకు బాటలు ఉండవని, విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కళాశాలలో ఏమైనా అనుకోని సంఘటనలు జరిగినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112, 100 కు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు,ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘువేంద్ర, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవ ప్రభాకర్, ఒంగోలు తాలూకా సీఐ విజయకృష్ణ, ఒంగోలు రూరల్ సీఐ యన్. శ్రీకాంత్ బాబు, సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య, ఎస్సైలు, ఐఐఐటి ఎస్ఎన్ పాడు, పేస్, రైజ్, క్విజ్, మలినేని, ఎస్‌జీఐటీ మార్కాపురం, కిట్స్ మార్కాపురం, ఏఐ గ్లోబల్, ఇందిరా ఇంజినీరింగ్ కాలేజీ, పలు ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్, అడ్మినిస్ట్రేషన్ విభాగం, హాస్టల్ వార్డన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.





## పీస్ మీటింగ్ నిర్వహించిన పోలీసులు

### మనమతాన్ని పూజించాలి పర మతాన్ని గౌరవించాలి ఎవరికీ ఇబ్బంది కలగకుండా వినాయకచవితి పండుగ జరుపుకోవాలి





(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 23)

ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కంభం పోలీస్ స్టేషన్ లో డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో మత పెద్దలతో కంభం సీఐ మల్లికార్జున, ఎస్ఐ నరసింహారావు కలిసి సంభంధిత అధికారులతో పీస్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా డీఎస్పీ నాగరాజు, తహసీల్దార్ కిరణ్, సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు మాట్లాడుతూ వినాయకచవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎలాంటి గొడవలు జరగకుండా చూసుకొనే భాధ్యత ఆయా ఏరియాలకు సంభందించిన కమిటీ పెద్దలు చూసుకోవాలని కమిటీలో ఎవరు ఉన్నారో పోలీస్ స్టేషన్ లో కమిటీ వివరాలు తప్పకుండా ఇవ్వాలని అలాగే నిమజ్జనం సమయంలో డీజేలు పెట్టకూడదు అని అలాగే మసీదులు, చర్చిలు, దేవాలయాలు ఉన్నచోట ఆ మందిరాలపై కుంకుమలు చల్లడం గాని ఇతర మతాల పేర్లతో దూషించడం లాంటివి చేయకుండా సుఖ సంతోషాలతో పండుగను జరుపుకోవాలని తెలిపారు.అన్ని మతాల పెద్దలతో మాట్లాడుతూ అందరూ పండుగల సమయంలో ఒకరికి ఒకరు సహకరించుకుంటూ అన్నదమ్ములు లాగా కలిసి మెలసి ఉంటూ చిన్న చిన్న మాటలకు అవేషాలకు పోకుండా ఉండాలని ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో పోలీసు సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, ఫైర్ సిబ్బంది అన్ని మతాల పెద్దలు పాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకోబోతున్న మహిళను రక్షించిన పోలీసులు



(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 23)

కంభం రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవడానికి రైలు పట్టాలపైకి వెళ్లిన మహిళను స్థానిక పోలీసులు చాకచక్యంగా రక్షించారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వెంటనే స్పందించిన పోలీసులు మహిళను అడ్డుకుని, సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం ఇరువర్గాలకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

## కంభం చెరువును సందర్శించిన పోలీసులు

### గణేష్ నిమజ్జనం సందర్భంగా చెరువు పరిసరాలు పరిశీలన





(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 23)

కంభం చెరువును డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో సీఐ మల్లికార్జున, ఎస్ఐ నరసింహారావు సిబ్బందితో కలిసి శనివారం కంభం చెరువును సందర్శించి చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. నిమజ్జనం రోజు వినాయకుని విగ్రహాలు వచ్చే మార్గాన్ని నిమజ్జనం చేసే చోటును నిమజ్జనం రోజు ఎలాంటి చర్యలు తీసుకోవాలో డీఎస్పీ నాగరాజు పోలీసులకు సలహాలు సూచనలు ఇచ్చారు. నిమజ్జనం రోజు ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ నాగరాజు కంభం పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డీఎస్సీ ఫలితాల్లో 22వ ర్యాంకు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 23)

మండల పరిధిలోని చాకిచెర్ల పెద్ద పట్టపుపాలెం గ్రామానికి చెందిన ఆవల సుమంత్ సన్నాఫ్ వెంకటేశ్వర్లు నిన్న డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ జిల్లా 22వ ర్యాంకు సాధించిన ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగా ఎంపికైన సందర్భంగా శనివారం రోజున ఆవల సుమంత్ ను వారి యొక్క తల్లిదండ్రులను పెద్ద పట్టపు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ కె. సలీం భాషా, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ వాయిల తిరుపతిరావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, సెక్రటరీ సుదర్శభాస్కరరావు పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో వైపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, ఆగస్టు 23)

పట్టణంలోని పోతురాజు గడ్డ వద్ద నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని, బురదను పంచాయతీ కార్మికులతో కలిసి స్వయంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. తద్వారా వ్యాధులు ప్రాబలకుండా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్స్, అంగన్వాడీ సిబ్బంది, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.








## టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 23)

మండల కేంద్రమైన ఉలవపాడు జి వి ఎస్ ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశానుసారంగా శనివారం రోజున హెల్త్ క్లబ్, రెడ్ చిల్డ్రన్ క్లబ్ వారు ఇది టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి ఎల్ కృపారాణి మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటువ్యాధి ఇది ఊపిరితిత్తులకు సంబంధించినదైన చర్మం నుండి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. మైకో బ్యాక్టీరియా లేదా మైకో బ్యాక్టీరియా ట్యూబర్ క్యూలోసిస్ అనే సూక్ష్మ క్రిమి వలన ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి ప్రధానంగా శ్వాస కోశాన్ని దెబ్బతీస్తుంది. డాక్టర్ రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధి కారక సూక్ష్మ క్రిములను మొదటిసారిగా మార్చి 24, 1882 సంవత్సరములో గుర్తించారు. ఇందుకుగాను 1905 లో వైద్యశాస్త్రంలో నోబుల్ బహుమతి ప్రధానం చేయబడింది. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం మార్చి24న ప్రపంచ క్షేవాడు నిర్వహించబడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ క్లబ్ కార్డు డేటా బి సుజాత, రెడ్ రిబ్బన్ క్లబ్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ మాణిక్యరావు, విద్యార్థులు అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది క్షయ వ్యాధి నిర్మూలకై తమ వంతు బాధ్యత నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# మాలపాడులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర




**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 23)**
మండలంలోని మాలపాడు గ్రామంలో శనివారం ఎంపీడీవో సుజాత అధ్యక్షతన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు అంటువ్యాధులు రాకుండా పంచాయతీ వారు తీసుకోవాల్సిన తగు చర్యలపై సూచనలు తెలిపారు. అనంతరం చెంచు పాలెం గ్రామంలో స్వామిత్వ సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా నిలిచేది ముఖ్యమంత్రి సహాయ నిధి

### వైపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు

### 50 మందికి రూ. 36,05,928 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి






**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, ఆగస్టు 23)**
యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆధ్వర్యంలో వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా 46 మందికి రూ.26,05,927 లక్షల చెక్కులను పంపిణి చేశారు. ముగ్గురికి ఎల్‌వోసీలు, మరో ఇద్దరికి ప్రమాద బీమా 10 లక్షల రూపాయలు అందజేశారు. ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ఆపదలో అండగా నిలిచేది ముఖ్యమంత్రి సహాయ నిధి అని, ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయాన్ని మరువకూడదని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నాలుగు పోస్టులలో ఉత్తమ ర్యాంకులు



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 23)**
శనివారం ప్రకటించిన డీఎస్సీ మెరిట్ జాబితాలో కనిగిరి కి చెందిన ఇరువురి కృష్ణారెడ్డి, పద్మ ల కుమార్తె కుమారి వెంకట హర్షిత ఒకేసారి 4 పోస్టులలో ఉత్తమ ర్యాంక్‌లు అసిస్టెంట్ -సోషల్ స్టడీస్‌లో జిల్లా ఫస్ట్1 ర్యాంక్, స్కూల్ అసిస్టెంట్ -ఇంగ్లీష్ లో 16 ర్యాంకు, ఎస్జీటీలో 7 ర్యాంకు , మోడల్ స్కూల్స్ పీజీటీ జాబితాలో4 ర్యాంక్ సాధించిన సందర్భంగా హర్షిత ను ఏపీఎన్జీవో సంఘం తాలూక అధ్యక్షులు పిల్లి వెంకట రమణారెడ్డి , హెడ్ మాస్టర్స్ సంఘం అధ్యక్షులు రామిరెడ్డి , హర్షితను ఆమె తల్లి, తండ్రి ఇరువురినీ అభినందించారు. హర్షిత చదువంతా కనిగిరి లోనే జరిగింది నాలుగు తరగతుల వరకు హనుమంతునిపాడు మండలం హాజీపురం, ఐదో తరగతి నుండి 8వ తరగతి వరకు హనీ స్కూల్, కనిగిరి. 9వ తరగతి కేటీఆర్ హైస్కూల్ కనిగిరి, పదో తరగతి గోమతి హై స్కూల్ కనిగిరి, ఇంటర్మీడియట్ కృష్ణ చైతన్య కాలేజ్ కనిగిరి, డిఈడి, బిఈడి కలాం కాలేజ్ కనిగిరి. డిగ్రీ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో పూర్తి చేశారు. హర్షిత డిఈడి ఎంట్రెన్స్ లో రాష్ట్రస్థాయిలో 11వ ర్యాంకు, బీఈడీ ఎంట్రన్స్‌లో మూడో ర్యాంక్ సాధించింది.

# రాష్ట్రానికి పెను సవాల్‌గా వైకాపా వదిలి పోయిన చెత్త

## 87 లక్షల టన్నుల వ్యర్థాల నిర్వహణ త్వరలోనే పూర్తి

## వినుకొండలో స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు









**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఆగస్టు 23)**
రాష్ట్రంలో అయిదేళ్ల వైకాపా పాలనలో వదిలిపోయిన చెత్త, వ్యర్థాలు ఇప్పటికీ సవాల్‌గా మిగలడం వారు చేసిన నష్టానికి, అరాచక, అడ్డగోలు పాలనకు నిదర్శనమని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. చెత్త పన్ను వేసింది కాక మొత్తం 87లక్షల టన్నుల చెత్తను ఎక్కడిక క్కడ కొండల్లా వదిలేసి పోయారని ఏడాదిగా వాటికి పరిష్కారం చూప డానికే శ్రమించాల్సి వస్తోందన్నారు. ఉన్న ఆ చెత్త చాలదన్నట్లు నిత్యం జగన్, వైకాపానేతలు, వారి అవినీతి పుత్రిక సాక్షి, కొన్ని దారి తప్పిన సోషల్ మీడియా ఛానెళ్లు మరింత చెత్త కుమ్మరి స్తూ, వాతావరణాన్ని, సమాజంలో సఖ్యతను, శాంతిభద్రతల్ని చెడగొట్టాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఐదేళ్లు విషప్రచారం, అసత్యాలను ప్రచారం చేసినందుకు ప్రజలు బుద్ధి చెప్పారని, అయినా గాని వారిలో మార్పు రాలేదని ఇకనైనా తీరు మార్చు కోవాలని హితవు పలికారు. వినుకొండలో శనివారం స్వచ్ఛతా ర్యాలీలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో కలిసి చెత్తను శుభ్రం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి బోసు బొమ్మ సెంటర్, పాత శివాలయం మీదుగా విద్యార్థులతో నిర్వహించిన స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన జీవీ వినుకొండ పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, ఇందులో భాగస్వామ్యం అవుతున్న ప్రతిఒక్కరికి అభినందనలు తెలిపారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధిస్తేనే ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని, ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధించినప్పుడే స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారమవుతుందని తెలిపారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చెత్తాచెదారం రోడ్లపై కాక ఆ బుట్టల్‌లోనే వేయాలని కోరారు. డ్రైనేజీల్లో చెత్తాచెదార వేయకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పనికిరాని మొక్కల్ని తొలగించాలన్నారు. డ్రైనేజీలతో పాటు ప్రతి వీధి, బజారును పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మన పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధించుకోగలుగుతామని వెల్లడించారు. గత ప్రభుత్వం వదిలివెళ్లిన 87 లక్షల టన్నుల చెత్త వ్యర్థాల్లో 80 శాతానికి పైగా ఇప్పటికే ఎత్తివేయించారని చెప్పారు. మరో నాలుగైదు నెలల్లో ఐదేళ్లుగా పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో చెత్త నుంచి సంపద సృష్టించే వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్లు పెడుతున్నామన్న జీవీ భవిష్యత్ మండల కేంద్రాల్లోనూ వాటి ని ఏర్పాటు చేస్తామన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎక్కడి వెళ్లాలన్నా హెలీకాప్టర్ వాడేవారని అయినా తెరలు కట్టాల్సి వచ్చేదని. చెట్లు నరికేసే వారని గతాన్ని గుర్తు చేశారు. నాచి చెట్లు నరికే సంస్కృతి మార్చి వాతావరణ కాలుష్య నివారణ పర్యావరణ పరిరక్షణకు రాష్ట్రంలో కోట్లాది మొక్కలు నాటుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లోరైడ్ బాధితులకు వీల్‌చైర్‌లు అందజేత

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 23)**
పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రకాశం జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఆఫీసర్ వి అనిల్ కుమార్ శనివారం సందర్శించారు. పొదిలి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ చంద్ర ఆధ్వర్యంలో పొదిలి పట్టణంలో ఫ్లోరోసిస్ వల్ల బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు వీల్ చైర్లు, కం ఔట్స్, హ్యాండ్ స్టిక్స్, వాకర్లు అందజేశారు. ఇంకా ఎవరైనా ఫ్లోరోసిస్ బాధితులు ఉంటే తెలియపరచాలని వారికి అవసరమైన పరికరాలను పైఉన్న అధికారులకు తెలియపరచి వారికి కూడా పరికరాలను అందజేస్తామని తెలిపారు. అనంతరం పట్టణంలోని స్కూళ్లను కేజీబీవీ స్కూల్‌ను, బాప్టిస్ట్ పాలెం ఎంపీపీఙ్ల మదాలవారిపాలెం , ఎంపీపీ స్కూల్ ను సందర్శించి విద్యార్థులకు ఫ్లోరోసిస్ వల్ల కలిగే నష్టాలను తెలియపరచి వారికి అవగాహన సదస్సును నిర్వహించారు మరియు వారికి హెల్త్ చెకప్ నిర్వహించారు. తరువాత స్కూల్స్ లో ఉన్న వాటర్ శాంపిల్స్ కలెక్ట్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఆఫీసర్ వి. అనిల్ కుమార్, ఫ్లోరోసిస్ ఎల్ టీ అంజిరెడ్డి, యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ చంద్ర, హెచ్‌వి మెరీనా, ఏఎన్ఎం విజయ, మాధవి, ఆదిలక్ష్మి, సారా, మెర్సీ, స్కూలు విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.







# ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం

### చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
### పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం
### పింఛన్లపై వైసీపీ,బ్లూ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోంది
### అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఫించన్ ఇస్తాం
### వైసీపీ హయాంలోనే కక్షపూరితంగా పేదలకు పింఛన్లు, రేషన్ కార్డులు తొలగించారు
### మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
### కొండపిలో టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం





**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 23)**
ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం నాడు ప్రకాశం జిల్లా కొండపిలో నియోజకవర్గ టీడీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిధులుగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి, మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నేతలు నివాళు లర్పించారు. అనంతరం మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలన్నీ సూపర్ పాస్ట్ గా అమలు చేస్తున్నాం. ఫించన్లు పెంచాం, ఇంట్లో ఎంతమంది విద్యార్థులున్నా తల్లికి వందనం ఇచ్చాం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మెగా డిఎస్సి ఇలా అన్ని హామీలు అమలు చేస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారు. చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కూటమి అభ్యర్థులు గెలవాలి. పించన్లపై వైసీపీ,బ్లూ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోంది. ఫించన్ల వేరిఫికేషన్ మాత్రమే జరుగుతోంది, తప్పుడు ధ్రువపత్రాలతో పింఛన్లు తీసుకుంటున్న అనర్హుల పింఛన్లు మాత్రమే తొలగించడం జరుగుతుంది. అర్హత కలిగిన ఏ ఒక్కరి పింఛన్ తొలగించం, అర్హులందరికీ ఫించన్లు ఇస్తాం. వైసీపీ హయాంలోనే కక్షపూరితంగా హౌస్ హెూల్డ్ మ్యాప్ లో వేరే వ్యక్తులను చేర్చి పేదలకు పింఛన్లు, రేషన్ కార్డులు తొలగించారు. వైసీపీ నాయకుల మాదిరి మేం తప్పుడు పనులు చెయ్యం. 2014 - 19 నీరు చెట్టు బిల్లులు విడుదల చేశాం, రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాలపై గత వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇవ్వడం వల్లే కేంద్రం హౌసింగ్ బిల్లులు ఇవ్వలేదు, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంతో మాట్లాడి లబ్ధిదారులందరికీ న్యాయం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.రాష్ట్ర అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన



# ట్రంప్ నకు మోది దాసోహం





**నక్సలైట్ల అంతం పేరుతో గిరిజనుల హత్యలు**
**వ్యక్తులను హతమార్చినా సిద్ధాంతాలను చంపలేరు**
**ప్రభుత్వ సంస్థలు భూములు కార్పొరేట్లకు అప్పగిస్తున్న మోది**
**రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం**
**గవర్నర్ లు కేంద్రానికి దళారులు**
**బాబు నితీష్ కాళ్ళపై మోడీ ప్రభుత్వం**
**ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలపై పోరాటం**
**సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ**
**ఒంగోలులో ఘనంగా సిపిఐ 28వ మహాసభలు**












**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)**

అంతర్జాతీయంగా దేశాల మధ్య ఘర్షణలు సృష్టించి ఇరుదేశాలకు ఆయుధాలు సరఫరా చేసి యుద్ధాలను ప్రోత్సహిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కి భారత ప్రధాని నరేంద్ర మోది దాసోహం అయ్యాడని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ విమర్శించారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోకూడదని టారిఫ్ లు పెంచుతామని భారత దేశాన్ని బ్లాక్ మెయిల్ చేస్తుంటే ఎందుకు ప్రశ్నించడం లేదని మోది సమాధానం చెప్పాలి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర 26వ మహాసభలు ఒంగోలు నగరంలో శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. నగరంలోని పురవీధులలో ఎర్రసైన్యం మహా ప్రదర్శన నిర్వహించింది. అనంతరం గుజ్జుల యలమందారెడ్డి సరళాదేవి ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. ముందుగా సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బహిరంగ సభను ఉద్దేశించి కే నారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోది 11 సంవత్సరాల్లో 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న కోట్లాది ఉద్యోగాలను ఊడగొట్టారని మండిపడ్డారు. స్విస్ బ్యాంకు నుంచి నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి ఒక్కరికీ 15 లక్షలు అకౌంట్లో వేస్తామని మోసం చేశారన్నారు. నక్సలైట్లను అంతం చేస్తామని పంతం పట్టిన మోదీ గిరిజనులను హత్య చేస్తున్నారని అన్నారు. అటవీ భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు గిరిజనులను దో చేస్తున్నారని పేర్కొన్నారు. నక్సలైట్లను హత్య చేసినంత మాత్రాన వారి సిద్ధాంతాన్ని అంతం చేయలేరని స్పష్టం చేశారు. నంబాల కేశవ్ ను చంపిన రోజే అదానికి 22 వేల ఎకరాలు భూమిని అప్పగించారని చెప్పారు. రాజ్యాంగబద్ధ వ్యవస్థలు తన నియంత పాలనకు అడ్డువస్తున్నాయని వాటిని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని అన్నారు. రాష్ట్రపతి పదవి గిరిజన మహిళకు ఇచ్చామని ప్రగల్భాలు పలుకుతూ ఆమె సంతకంతో గిరిజన వ్యతిరేక చట్టాలు చేస్తున్నారని విమర్శించారు. గవర్నర్ లు కేంద్రానికి దళారులుగా తయారు అయ్యారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రభుత్వాలను ఇబ్బందుల పాలు చేస్తున్నారని నారాయణ పేర్కొన్నారు. ఎన్నో మంచి తీర్పులను ఇచ్చిన సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి నుంచి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబడితే ఆయన నక్సలైట్ అని బిజెపి దుర్మార్గంగా ప్రచారం చేస్తోంది అన్నారు. 30 రోజులు జైలులో ఉంటే ప్రధానమంత్రి ముఖ్యమంత్రి వంటి పదవులలో ఉండరాదు అంటూ అమిత్ షా కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నారని అన్నారు. ఈ చట్టం ద్వారా బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై తప్పుడు కేసులు పెట్టేందుకు కుయుక్తులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి చట్టం వస్తే మొట్టమొదటగా తన కేసు నుండి బయటపడేందుకు 12 మంది లాయర్లు సాక్షులను చంపించి నిర్దోషిగా బయటకు వచ్చిన అమిత్ షా పై ప్రయోగించాలి అన్నారు. జీఎస్టీ ద్వారా 22 లక్షల కోట్లు వసూలు చేశామని మోదీ గొప్పలు చెప్పుకుంటున్నారని, కార్పొరేట్ కంపెనీలకు 33 శాతం నుంచి 23 శాతానికి తగ్గించి సామాన్యులపై ఐదు శాతం నుండి 18 శాతానికి జీఎస్టీ పెంచడంపై సమాధానం చెప్పాలని కోరారు. సామాన్యుడు వాడే చెప్పులపై జీఎస్టీ ని పెంచిన ఘనత మోది కే దక్కుతుంది అన్నారు. మోది అధికారంలోకి వచ్చాక నిరుద్యోగం, నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటాయి అన్నారు. బీహార్ ఎన్నికలలో ఎలాగైనా గెలవాలని దొంగ ఓట్లను చేర్చుకొని ఉన్న ప్రతిపక్ష ఓట్లను తీసివేశారని పేర్కొన్నారు. ఇలాంటి దుర్మార్గ పాలన సాగిస్తున్న నరేంద్ర మోది ప్రభుత్వానికి చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ రెండు కాళ్లుగా నిలబడడం సిగ్గుచేటు అన్నారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు నేడు స్మార్ట్ మీటర్లను అమర్చేందుకు అత్యుత్సాహం చూపించడం బాబు నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనం అన్నారు. ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం కోసం పార్టీని స్థాపించి ఆనాడు ఆర్ఎస్ఎస్ నీ వ్యతిరేకించారని, నేడు చంద్రబాబు స్వలాభం కోసం టిడిపిని బిజెపికి దాసోహం చేశారని విమర్శించారు. సంవత్సరానికి మూడు పంటలు పండుతూ పచ్చగా ఉన్న పలాస లో 6వేల ఎకరాలు పోర్టుకు అప్పగించాలని చూడడం సమంజసం కాదు అన్నారు. చంద్రబాబుకు 100 ఎకరాలు అవసరం ఉంటే 1000 ఎకరాలు కావాలని ఉబలాటపడుతాడు అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రోజుకు మాట పూటకో వేషం వేస్తూ సనాతన ధర్మాన్ని నెత్తికి ఎత్తుకొని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. బలవంతంగా రైతుల భూములు లాక్కొని బడా బాబులకు అప్పగించాలన్న చూస్తే మరో పోరాటం సాగించి బాబుకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీని గ్రామీణ స్థాయి నుండి బలోపేతం చేయాలని, చివరి క్షణం వరకు ప్రజా పక్షాన పోరాడిన సురవరం సుధాకర్ రెడ్డి ని స్ఫూర్తిగా తీసుకొని కార్యకర్తలు పోరాటపటిమను పెంచుకోవాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ అన్నారు. వంద సంవత్సరాల కాలంలో పేదల కోసం త్యాగాలు చేసి, జైల్లోకి వెళ్లి, రక్త తర్పణ చేసిన పార్టీ సిపిఐ అన్నారు. ఎం స్వాతంత్ర్య పోరాటంలో దేశంలో పాల్గొన్న పార్టీలు రెండే అన్నారు. ఒకటి మహాత్మా గాంధీ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కాగా, మరొకటి ఎర్రజెండా పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ తో పాటు ఆవిర్భవించినా ఆర్ఎస్ఎస్ ఏనాడు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదన్నారు. బ్రిటిష్ వారి అడుగులకు మడుగులు వత్తుతూ, తొత్తులుగా వ్యవహరించారన్నారు. అటువంటివారు నేడు అధికారంలో ఉండి ఎర్రకోటపై స్వాతంత్ర్య ం సాధించిన భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు వంటి వారి ప్రాణత్యాగాలతో దేశానికి స్వాతంత్రం వచ్చిందని చెప్పటం లేదన్నారు. స్వాతంత్ర పోరాటంతో ఇటువంటి సంబంధంలేని ఆర్ఎస్ఎస్ నాయకులు సావర్కర్ ను పొగడటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. దొంగ ఓట్లతో బీజేపీ రాజ్యమేలుతుందన్నారు. రానున్న బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బిజెపికి తొత్తుగా మారిన ఎన్నికల కమిషన్ బిజెపికి వ్యతిరేకంగా ఓట్లు వేసే 65 లక్షల మంది ఓట్లను తొలగించిందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో కూడా దొంగ ఓట్లు ద్వారానే కేంద్రంలోని బిజెపి అధికారంలోకి వచ్చింది అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం బిజెపికి అమ్ముడుపోయిందన్నారు. దీనిపై సాక్షాలతో సహా దొంగ ఓట్లను బయటపెట్టిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కి నోటీసులు ఇస్తూ బెదిరించాలని చూస్తుందన్నారు. దేశవ్యాప్తంగా దొంగ ఓట్లపై ప్రజలు చర్చిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘానికి గాని, కేంద్ర ప్రభుత్వానికి గాని పట్టటం లేదన్నారు. ప్రపంచంలోనే గొప్ప ప్రధాని మోడీ అంటూ చంద్రబాబు నాయుడు కితాబులు ఇస్తుంటే, జగన్ మాత్రం పులివెందుల ప్రజాస్వామ్యం అంటూ ఎన్నికల ప్రస్తావనలు తీస్తున్నారన్నారు. పులివెందులలో చంద్రబాబు నాయుడు ఓటర్లను ఓట్లు వేయకుండా భయపెడితే, జగన్ అధికారంలో ఉన్నప్పుడు కనీసం నామినేషన్లు కూడా వేయి నీ కుండా ఏకగ్రీవాలు చేసుకునేవారు అన్నారు. పవన్ కళ్యాణ్ అయితే సనాతన ధర్మం అంటూ, ఆర్ఎస్ఎస్ ఏజెండా తన ఎజెండా అంటూ బొట్లు పెట్టుకొని గుడుల చుట్టు తిరుగుతున్నారన్నారు. డబల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకుని చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో 22 సార్లు ఢిల్లీకి వెళ్లారన్నారు. అక్కడ మంత్రులను, ప్రధానిని, కలిసి ఏం సాధించారో చెప్పాలి అన్నారు. ఏడాది కాలంలో చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి సాధించిన అభివృద్ధి రూ. 75 వేల కోట్లు అప్పు అన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో రూ. 32 లక్షల అప్పు తెచ్చారన్నారు. మరో 32 లక్షలు అప్పులు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొంటున్నారన్నారు. అయితే చంద్రబాబు నాయుడు మాత్రం అమరావతి రాజధాని నిర్మాణం కోసం రూ.78 అప్పు చేస్తున్నామని పేర్కొంటున్నారన్నారు. మంత్రి, ముఖ్యమంత్రి వ్యాఖ్యలలో ఏది వాస్తవమో తెలపాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణం త్యాగాలతో సాధించుకుందాం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ పై చంద్రబాబు నాయుడు ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరిగితే చంద్రబాబు నాయుడు ను తెలుగుజాతి క్షమించదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలు కచ్చితంగా నెరవేర్చాల్సిందేనని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతంలోని పేదలకు రెండు సెంటు, గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మూడు సెంట్లు వంతున నివేశిత స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో సిపిఐ పిలుపుమేరకు డబుల్ ఇంజన్ స్పీడ్ తో ప్రభుత్వంపై ఇళ్ల స్థలాలకు పోరాటం సాగించాలని, అందుకు ప్రజలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాల నాగేశ్వరరావు, జె వి వి సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పి హరినాథ్ రెడ్డి, జి ఓబులేసు, పి రామచంద్రయ్య, జగదీష్, కే వి వి ప్రసాద్, జంగాల అజయ్ కుమార్, డేగ ప్రభాకర్, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ పి జె చంద్రశేఖర్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్ నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.





## విద్యార్థు లందరూ విద్య ప్రాముఖ్యతను తెలుసుకొని లక్ష్యంతో చదవాలి

### ప్రధానోపాధ్యాయుడు బాలరాజు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 23)
మండలంలోని చెన్నారెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం బాలరాజు అధ్యక్షతన చదువు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ పాల్గొన్నారు ఈ సందర్భంగా చిన్ని సేవాసంస్థ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ క్రమ శిక్షణతో ఒక లక్ష్యంతో చదవాలి అని అన్నారు అలాగే చదువు ఉన్నతస్థాయి చేరుస్తుంది అని అన్నారు చదువు ప్రాముఖ్యత గురిం చి విద్యార్థులకు తెలియజేశారు విద్యార్థులు అందరూ ఫోన్ కు దూరంగా ఉండాలి అని అన్నారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం బాలరాజు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ మంచి పవర్తన కలిగి ఉన్నత లక్ష్య సాధన కోసం కష్టపడి చదవి మంచి భవిష్యత్తు కలిగి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకోని రావాలి అన్నారు అలాగే ఉపాధ్యాయులు ముందు ఉండి విద్యార్థులను నడిపించుకు కృత నిశ్చయంతో ఉన్నారు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ఓ రవి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ స్పేస్ గురించి విద్యార్థులకు వివరించారు విద్యార్థులకు కష్టపడి చదివే అలవాటు పెంపోదించుటకు విద్యార్థులు చేత ప్రతిజ్ఞ చేయించారు సొసైటి సభ్యుడు మహేష్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువంకోనుటకు అన్నివిధాల ప్రధానోపాధ్యాయులు సహకారం లభిస్తుంది అని ఉపాధ్యాయుల సహకారాన్ని అందిచేందుకు కృషి చేస్తారు అని తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ ను సన్మానించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం బాలరాజు చిన్ని సేవా సంస్థ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ సొసైటి సభ్యుడు మహేష్ నాయక్ ఉపాధ్యాయులు కోటి మోహన్ నరసింహారావు హేమలత రాజ శేఖర్ రెడ్డి రమేష్ బాబు కిషోర్ బ్రహ్మం పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులను యూడైస్‌లో నమోదు చేయాలి



(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 23)
పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరినీ తప్పనిసరిగా యూడైస్ ఆన్లైన్ పోర్టల్ నందు నమోదు చేయాలని ఎంఈవోలు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. భౌతికంగా పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థికి యూడైస్ంలో జీపీ,ఈపీ,ఎఫ్పీలను నవీకరిస్తూ అపార్ ఐడీ, పెన్ నంబర్లను క్రియేట్ చేయడం తప్పనిసరి,తనిఖీల్లో వ్యత్యాసాలను ఉపేక్షించబోమన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

### చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 23)
కనిగిరి పట్టణంలోని 5వ సచివాలయంలో శనివారం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో 79 వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా చేతుల మీదుగా రెండవ సారి ఉత్తమ అవార్డు అందుకున్న వి.ఆర్.ఓ బసిరెడ్డి శ్రీకాంత్‌ను కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. విఆర్ఓ శ్రీకాంత్ తన కృషి, సేవా భావం, సమాజానికి అందించిన విశిష్టమైన సేవలు కారణంగా ఈ అవార్డు లభించిందని సమాజంలో ఇలాంటి ఆదర్శవంతులైన వ్యక్తులు మరింతమందికి స్ఫూర్తి నింపుతారని అభినందించారు. సన్మాన కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, గౌరవ అతిథులు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొని అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు తెలిపారు.అంతరం ఐటిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జాంషీర్ అహమ్మద్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు గుడ్ హెల్ప్ రమేష్ బాబు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మస్తాన్ వలి, స్థానిక ప్రజలు నాగురబీ, గౌస్ బాష, రహిమాన్, సన్మాన గ్రహీతకు పూల మాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# కదం తొక్కిన కామ్రేడ్లు

**- ఎర్రసంద్రమైన ఒంగోలు - వేలాదిమందితో మహా ప్రదర్శన**
**ఆకట్టుకున్న రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు**
**ప్రత్యేక ఆకర్షణగా కళారూపాలు**





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)
సీపీఐ రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా ఒంగోలు ఎరుపెక్కింది. కామ్రేడ్లు కదం తొక్కారు. భారత కమ్యూనిస్టుపార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 28వ మహాసభలను పురస్కరించుకుని శనివారం ఒంగోలు నగరంలో నిర్వహించిన భారీ ప్రదర్శన సీపీఐ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు వేలాదిమంది తరలివచ్చిన కార్యకర్తలు కదం తొక్కుతూ, పదం పాడుతూ మహాప్రదర్శనలో పాల్గొన్నారు. నెల్లూరు బస్టాండ్ సెంటర్ లోని మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన భారీ ప్రదర్శన కలెక్టరేట్, ట్రంకు రోడ్డు, అద్దంకి బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, కొత్త కూరగాయల మార్కెట్ మీదుగా సభా ప్రాంగణం వరకు సాగింది. ఈ ర్యాలీకి రాష్ట్ర నలుమూల నుంచి సీపీఐ, ప్రజా సంఘాలకు చెందిన శ్రేణులు పోటాపోటీగా తరలివచ్చారు. పురుషులు ఎర్రచొక్కాలు, మహిళలు ఎరుపు చీరలు ధరించి ప్రదర్శనలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కొందరు మహిళలు చంటి పిల్లలను ఒక చేత్తో ఎత్తుకొని, మరోచేత్తో ఎర్రజెండా చేతబూని ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొనడం అందరినీ ఉత్తేజపరిచింది. చిన్నా, పెద్దా తేడా లేకుండా పిల్లలు, వృద్ధులు, మహిళలు ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సీపీఐ జిందాబాద్, ఎర్రజెండా వర్ధిల్లాలి అనే నినాదాలతో నగర వీధులు మారుమ్రోగాయి. నగరంలో ఎటు చూసినా ఎర్రజెండాలు, అరుణ పతాకాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్లతో ఎరుపుమయమైంది. కిలోమీటర్ల పొడవునా ముందుభాగాన సాగిన రెడ్ షర్ట్ వాలంటీర్లు కవాతు, పార్టీ మహాసభల సంఖ్యను సూచిస్తూ 28 సీపీఐ పార్టీ పతాకాలతో సాగిన రెడ్‌ఫ్లాగ్ మార్చ్ ప్రజలను ఆకర్షించింది.




సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, ఏఐకేఎస్ ప్రధానకార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య, అక్కినేని వనజ, హరినాథరెడ్డి, రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్, జంగాల అజయ్‌కుమార్, దేగా ప్రభాకర్, జగదీష్, సినీనటుడు మాదాల రవి, ప్రజాసంఘాల నాయకులు తదితరులు ప్రదర్శన అగ్రభాగాన నిలిచారు. వివిధ జిల్లాలకు చెందిన సీపీఐ కార్యదర్శులు వారి జిల్లాలకు సంబంధించిన ప్రధాన డిమాండ్లతో కూడిన బ్యానర్లు చేబూని ఒక క్రమ పద్ధతిలో ప్రదర్శనలో పాల్గొన్నారు. సీపీఐ, అనుబంధ ప్రజా సంఘాలకు చెందిన శ్రేణులు, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన వారు కూడా ప్రత్యేక డిమాండ్లతో కూడిన బ్యానర్లతో ప్రదర్శనలో పాల్గొన్నారు. కంకి కొడవలి గుర్తుతో మహిళలు ధరించిన గొడుగులు, యంగ్ కమ్యూనిస్ట్ మార్చ్ పేరుతో యువజనుల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. డప్పుల దరువు, కనకతప్పెట్లు, కోలాటాలతో పురవీధులు మారుమోగాయి. కొమ్ముల నృత్యాలు, దింసా నృత్యం, జానపద, గురవయ్యలు, వివిధ ప్రాంతాలకు, గిరిజన తండాలకు సంబంధించిన సంప్రదాయ నృత్యాలు ప్రదర్శనకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీపీఐ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దాదాపు 1000 మంది ప్రజానాట్య మండలి కళాకారులు వంద డప్పులు, వంద పాటలు, వంద గొంతుకల ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. రెండు లైన్లుగా అత్యంత క్రమశిక్షణతో సాగిన ఈ ప్రదర్శనకు ముందుభాగాన భారత లౌకిక వ్యవస్థ, మత సామరస్యతను చాటిచెపుతూ హిందూ, క్రిస్టియన్, ముస్లింల వేషధారణ, మరోవైపు ప్రప్రథమ సోషలిస్టు రాజ్య నిర్మాత లెనిన్ వేషధారణతో కూడిన ప్రజానాట్యమండలి కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దారిపొడవునా




కమ్యూనిస్టు పార్టీ శ్రేయోభిలాషులు, అభిమానులు సీపీఐ నేతలపై పూలు చల్లుతూ స్వాగతం పలికారు. కమ్యూనిజం వర్ధిల్లాలి, సామ్రాజ్యవాదం నశించాలి, మార్క్సిజం, లెనినిజం అజరామరం, సీపీఐ శత వార్షికోత్సవాలు వర్ధిల్లాలి అంటూ ప్రదర్శనకారులు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు.

మోదీ, చంద్రబాబు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శ్రేణులు చేసిన నినాదాలు ప్రజలను ఆలోచింపజేశాయి. వేలాదిమందితో సాగిన ఈ ప్రదర్శన ఒక పాయింట్ దాటడానికి గంట సమయం పట్టింది. అనంతరం కామ్రేడ్ గుజ్జుల యలమందారెడ్డి,సరళాదేవి సభా ప్రాంగణంలో బహిరంగసభ నిర్వహించగా, పార్టీ శ్రేణులతో పాటు రాజకీయపార్టీల కతీతంగా ఈసభకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయాల పరిణామాలు, భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి కమ్యూనిస్టుపార్టీ శ్రేణుల కర్తవ్యాలను వివరిస్తూ సీపీఐ నేతలు దిశానిర్దేశం చేశారు.















## ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం

### కనిగిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ ధూళిపాళ్ల

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 23)
స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయమని కనిగిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ ధూళిపాళ్ల మల్లికార్జునరావు అన్నారు. శనివారం వికలాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో జరిగిన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి కనిగిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ ధూళిపాళ్ల మల్లికార్జునరావు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు న్యాయవాదిగా పనిచేస్తూ స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారిని గడగడలాడించిన చరిత్ర ప్రకాశం పంతులుదని ఆయన అన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన నీతి నిజాయితీలతో పనిచేశారని ఆయన అన్నారు. ప్రకాశం పంతులు జీవితం యువతకు ఆదర్శమని మల్లికార్జున్‌రావు అన్నారు, ప్రకాశం పంతులు నేటి తరానికి ఆదర్శమని కనిగిరి బ్రాహ్మణ సంఘం నాయకులు చక్కిలం మురళీకృష్ణ, సాదు చలపతిరావు, సింగంపల్లి రాంప్రసాద్ అన్నారు. ప్రకాశం పంతులు మన జిల్లాలో పుట్టడం మన జిల్లాకు ప్రకాశం పంతులు పేరు పెట్టడం గర్వంగా ఉందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రకాశం పంతులు పేరుతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. జోహార్ ప్రకాశం పంతులు అంటూ వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల వేదిక కనిగిరి నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు, వేగినేటి వెంకట సుబ్బారెడ్డి వేముల మైనర్ బాబు, మహిళా విభాగ అధ్యక్షులు లక్ష్మీ శ్రీరామ, వెంకటేశ్వర్లు షేక్ బాషా, వెంకటేశ్వర్ రెడ్డి ప్రజా హక్కుల వేదిక నాయకుడు బత్తుల సునీల్, బ్రాహ్మణ సంఘం నాయకులు ఐనంపూడి చంద్రశేఖర్, ప్రసాద్ పిడుగు రామచంద్రరావు, చంద్రశేఖర్ ,తదితరులు పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com